ANDHRA BHOOMI

SECUNDERABAD
ANDHRA PRADESH
Phone: Editorial — 74003
Office — 72244

Regd.A-399

THE POPULAR TELUGU DAILY PUBLISHED FROM THE CAPITAL

ఆంధ్రభూమి చందా రేట్లు

		ఏజంటు ద్వారా	పోష్టు ద్వారా	విమానం ద్వారా
సంవత్సరానికి	రు.	27-00	28-00	36-00
అర్ధ సంవత్సరానికి	రు.	14-00	15-00	19-00
మూడు నెలలకు	రు.	7-00	8-00	10-00

ఆంధ్రభూమి

ఎడిటర్ : గోరా శాస్త్రి

110892

ఆంధ్రభూమి ప్రకటన రేట్లు

క్యాజుయల్ 99 అం॥ వరకు కాలం అం॥ 1కి		4-00
కంట్రాక్టు 100 అం॥ 1½ నెలలకు	,,	8-00
కంపెనీ. మీటింగు నోటీసులు	,,	6-00
కంపెనీ అధ్యక్షోపన్యాసాలు	,,	4-00

సంపుటి 4 : సంచిక 217 * సికింద్రాబాద్ 11-5-1964 సోమవారం * 4 పేజీలు : 7 నయాపైసలు

దేశంలో నిర్మితమైన తొలి ఫైటర్ల వైమానిక దళానికి అప్పగింత

ఫైటర్ విమానానికి మారుత్ నామం

బెంగుళూర్ మే 10

పూర్తిగా మన దేశంలో తయారు చేసిన హెచ్ 24 సూపర్ సానిక్ ఫైటర్ విమానానికి నేడిక్కడ జరిగిన నామకరణోత్సవంలో రక్షణమంత్రి శ్రీ వై. బి. చవాన్ "మారుత్" అని పేరుపెట్టారు.

మనం దేశంలో ఉత్పత్తి అయిన మొదటి రెండుసూపర్ సానిక్ ఫైటర్లను వైమానికదళానికి నేటి ఉత్సవంలో అప్పగించారు.

ఈ సంస్కృత శబ్దాన్ని విమానానికి పేరుగా పెట్టాలన్న సూచనను ప్రధాని నెహ్రూ నిన్ననే ఆమోదించారనీ పేరు పెట్టే విషయంలో ఎంతో ఆలోచించడం జరిగిందనీ శ్రీ చవాన్ అన్నారు.

ఈ విమానాన్ని ఇకపై "మారుత్" "పవనశక్తి"అనే పేరుతో వ్యవహరిస్తారు.

పేరు ప్రకటించిన వెంటనే సభలోని వారంతా హర్షధ్వానాలు చేసారు.

ప్రజల ఆత్మవిశ్వాసమే రక్షణకు మూలాధారమని చవాన్ అభిభాషణ

బెంగుళూరు మే 10 (పి. టి. ఐ)

వైమానికదళానికి అవసరమైన విమానాలను స్వయంగా ఉత్పత్తి చేసుకోగలమనేభావం దేశాన్ని రక్షించుకోగలమనే విశ్వాసాన్ని దృఢతరం చేస్తుందని రక్షణమంత్రి శ్రీ వై. బి. చవాన్ నేడు ఇక్కడ అన్నారు.

హిందుస్తాన్ ఎయిర్‌క్రాఫ్ట్ లిమిటెడ్ కంపెనీలో తయారైన హెచ్.ఎఫ్.-24 సూపర్ సానిక్ విమానాలను భారత వైమానికదళానికి అప్పగించిన సందర్భంలో జరిగిన ఉత్సవంలో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

ఉత్తర దిశనుండి కానీ మరే దిశనుండి కానీ ఎవరు దాడి చేసినా భయపడవలసిన పనిలేకుండా వైమానిక దళాన్ని పటిష్టం చేయాలనే ప్రభుత్వం సంకల్పమని ఆయన అన్నారు.

దానికోసమే ఇంతవరకూ చేయని పనిని స్వయంకృషిద్వారా చేసి అభివృద్ధి పరచుకోవడానికి యత్నించటం జరుగుతున్నదని శ్రీ చవాన్ అన్నారు.

విదేశాలనుండి కొనుగోలు చేసుకోవడంద్వారానే కాక, దేశంలో స్వయంకృషిద్వారా విమానాలను ఉత్పత్తి చేసుకోగలమనే విశ్వాసం దేశ ప్రజలలో దీనివల్ల కలుగుతుందని ఆయన అన్నారు.

ఈ విమానాలను తయారుచేసిన హిందుస్తాన్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీకి గర్వకారణమేకాక భారత వైమానిక దళానికి నేటి దినం ముఖ్యమైనదని ఆయన అన్నారు.

ఈ విమానాలపట్ల వైమానికదళ పైలట్లు సంతృప్తి ప్రకటించినట్టు ఎయిర్ మార్షల్ ఇంజినీర్ తెలిపారని ఆయన అన్నారు.

హెచ్. యఫ్.-24 విమానాలను ఇండియా ఎలాఉత్పత్తిచేసుకొంటున్నదోనని విమానయానం పట్ల ఆసక్తికల విదేశీయులు కూడా గమనిస్తున్నారని ఆయన అన్నారు.

ప్రపంచంలో ఇతరులకు భారతీయుల ప్రతిభ తీసిపోదనీ వారికి విశ్వాసంకలుగుతుందని గట్టిగా చెప్పగలనని ఆయన అన్నారు.

ఈ కంపెనీ సిబ్బందిని అభినందిస్తూ "భారత్ ఆధునిక దేవాలయ" మని హిందుస్తాన్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీని ఆయన అభివర్ణించారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు హెచ్చించినట్టుగానే ఈకంపెనీ సిబ్బందికి కూడా కరువుభత్యాన్ని పెంచుతున్నట్టు రక్షణ మంత్రి ప్రకటించారు.

రఘురామయ్య అభినందనలు

ఈ విమానాన్ని నిర్మించడం ద్వారా అభివృద్ధి సాధించిన కార్మికులను అభినందిస్తూ ప్రపంచంలోని మరే విమానంతో పోల్చిచూసినప్పటికీ ఇది మేలురకమైనదని రక్షణ ఉత్పత్తి శాఖ మంత్రి శ్రీ కె రఘురామయ్య అన్నారు.

ఈ కార్యక్రమం ఇంతటితో పూర్తి అయినదని భావించరాదనీ, మరింత అభివృద్ధిసాధించాలనే దృష్టి పెట్టుకోవాలనీ, ఆ విధంగా చేసే పక్షంలో మరేదేశంకూడా వెనుకబడిలేమనిచెప్పుకొనే తాహతు ఉంటుందని ఆయన అన్నారు.

ప్రపంచంలోని ఏ వైమానిక పరిశ్రమ కూడా పరికరాల విషయంలో ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్‌లో స్వయం సమృద్ధి సాధించనప్పటికీ పరికరాలను చాలావరకు దేశంలోనే తయారు చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేయాలని శ్రీ రఘురామయ్య అన్నారు.

ప్రాక్పశ్చిమ మైత్రి సాధన ఆవశ్యకత

బ్రిటిష్ విదేశాంగ మంత్రి వివరణ

సెయింట్ ఎడ్మండ్స్, మే 10

పశ్చిమదేశాలతో సన్నిహితమైన సహకారంతో రష్యాకు ప్రయోజనాల దృష్ట్యానే ఆసక్తి పెంపొందినదని బ్రిటన్ విదేశాంగమంత్రి ఆర్. ఎ. బట్లర్ నేడిక్కడ అన్నారు.

పార్లమెంటరీ ఉపఎన్నిక ప్రచారసభలో మాట్లాడుతూ, "వాణిజ్యాభివృద్ధి" తదితర రంగాలలో ఇతోధిక సంబంధాల దృష్ట్యా రాజకీయంగా పరస్పరావగాహనను పెంపొందింపచేసి ఉభయకూటాలను సన్నిహితం చేయడానికి కృషి చేయవలసిఉంది" అని బట్లర్ అన్నారు.

ప్రచ్ఛన్న యుద్ధ వైషమ్యాలన్నీ హఠాత్తుగా తొలగిపోయి అప్పమైత్రి నెలకొనగలదనే భ్రమలుకూడా తగవని ఆయన అన్నారు.

నిరాయుధీకరణ, ఐక్యరాజ్యసమితి శాంతిస్థాపనా కృషిని పటిష్టం చేయడం సంపన్న బడుగుదేశాలమధ్య ఉన్న అఖాతాన్ని తొలగించడం బ్రిటిష్ విదేశాంగ విధానాల లక్ష్యాలుగా ఆయన వివరించారు.

సింకియాంగ్‌లో రష్యా విచ్ఛిన్నకర చర్యలు సాగిస్తున్నట్టు ఆరోపణ

పారిస్ మే 9

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ నాయకులతోను ఇండియా అభివృద్ధి నిరోధక సంకుచిత జాతీయ వాదులతోను తప్ప తక్కిన అన్ని దేశాలతోను తాము సహృద్భావ సంబంధాలు పెంచుకోగలమని సోవియట్ యూనియన్ సింకియాంగు రాష్ట్రంలోని చైనీయేతరులలో రేడియో ద్వారా పత్రికలద్వారా చైనావ్యతిరేక ప్రచారం విచ్ఛిన్నకర చర్యలుసాగిస్తున్నదని చైనా కమ్యూనిస్టుపార్టీ నేడిక్కడ వెలువడిన ఒక లేఖలో పేర్కొన్నది.

సోవియట్ యూనియన్‌లో ఆర్థిక స్థితి దిగజారుతున్నదని అది భరించలేని తాము అన్ని రంగాలలోను సహాయ సహకారాల నందజేయడానికి సిద్ధంగా ఉన్నామనికూడా చైనా పార్టీ ఆ లేఖలో పేర్కొన్నది.

చైనా కమ్యూనిస్టు పార్టీ ఈలేఖను ఈ సంవత్సరం ఫిబ్రవరి 29న వ్రాసింది.

జపాన్ సహాయంతో దుక్క ఇనుము కర్మాగారాల నిర్మాణం

మద్రాస్, మే 10

ఈ సంవత్సరానికి 8లక్షలటన్నుల మేరకు ఉత్పాదనాపాటవం గల దుక్క ఇనుము కర్మాగారాలను జపాన్ సహాయంతో నెలకొల్పడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి

ఈ విషయంపై చర్చలుజరిపే నిమిత్తం భారత ప్రభుత్వ ఆహ్వానంపై టోక్యోలో, నిటిసలా యా కంపెనీకి చెందిన ఆరుగురు నిపుణులబృందం మన దేశంలో పర్యటన జరుపుతున్నది ఈ బృందం సభ్యులు నిన్న ఇక్కడికి హైదరాబాద్ నుండి వచ్చారు

ఈ కర్మాగారాలు ఒక్కొక్కదానిని స్థాపించడానికి మూడుకోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది.

ఆంధ్ర, మద్రాస్, పంజాబ్ పశ్చిమ బెంగాల్ గోవా ప్రాంతాలలో ఈ కర్మాగారాలను నెలకొల్పుతారు. ఒక్కొక్కటి లక్షటన్నుల మేరకు దుక్క ఇనుము ఉత్పత్తి చేయగలదు వీటిలో కొన్ని ప్రభుత్వ రంగంలోను మిగిలిన వాటిని ప్రైవేటురంగంలోను నెలకొల్పుతారు.

దుక్క ఇనుము ఉత్పత్తిలో జపాన్ నూతన పద్ధతులను రూపొందించింది ఆ పద్ధతుల ప్రకారమే ఈ కార్మాగారాలను నెలకొల్పుతారు.

మద్రాసు రాష్ట్రంలో ఈ కార్మాగారాన్ని నెలకొల్పే స్థలాన్ని నిర్ణయించే విషయంపై రాష్ట్రప్రభుత్వంతో ఈ బృందం చర్చిస్తుంది

జమ్మూ వద్ద బాంబు ప్రేలుడు

జమ్మూ మే 9

ఇక్కడకు 13 మైళ్ళలోగల మిరాన్‌సాహిబ్ అనే సరిహద్దు పట్టణంలోని పవర్ హౌస్ భవనాలవద్ద నేడొక బాంబు ప్రేలుడు సంభవించింది ఐతే యీ ప్రేలుడువల్ల నష్టమేమీ సంభవించలేదని తెలుస్తోంది.

విమాన ప్రమాదంలో 49 మంది మరణం

లిమా, (పెరూ) మే 9

సుమారు 49 మంది ప్రయాణీకులతో నిన్న రాత్రి లిమా సముద్ర తీరంలో ప్రమాదానికి గురియైన, అర్జంటైనా విమాన శిథిలాలు నీటిపై తేలుతుండగా పెరూ వైమానిక దళ విమానాలు చూచినట్టు తెలుస్తోంది ప్రయాణీకులంతా మరణించి ఉండవచ్చునని భావిస్తున్నారు.

అక్రమంగా అస్సాంలో ప్రవేశించిన పాకిస్తానీల గెంటివేత ఆవశ్యకత

కేంద్రప్రభుత్వానికి పి. సి. సి. విజ్ఞప్తి

గౌహతి, మే 10

అస్సాం ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కార్యవర్గం అస్సాం కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం నిన్నటి దినం ఇక్కడ ఎ పి సి సి ప్రెసిడెంటు శ్రీ శరత్‌చంద్రసిన్హా అధ్యక్షత క్రింద జరిగింది.

సక్రమ ప్రయాణ పత్రాలులేకుండా భారతదేశంలో ప్రవేశించిన పాకిస్తానీలను వెంటనే త్రిప్పి పంపివేయవలసిన ఆవశ్యకతను కాంగ్రెసు అధ్యక్షునికి ప్రధానికి, కేంద్ర హోమ్ మంత్రికీ, ప్రభుత్వానికి నివేదించటానికి ఒక రాయబారం పంపాలని రాష్ట్ర కాంగ్రెసు కమిటీ చేసిన నిర్ణయాన్ని శ్రీ శరత్ చంద్రసిన్హా పునరుద్ఘాటించారు.

రాష్ట్రకాంగ్రెస్ కమిటీతీర్మానాన్ని అనుసరించవలసిన విషయంలో భారత, పాకిస్తాన్ హోంమంత్రుల రెండవసమావేశం జరగటానికి పూర్వం, హోంశాఖమంత్రి వద్దకు రాయబారం వెళ్లాలనికూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

సరియైన ప్రయాణపత్రాలు లేకుండా అక్రమంగా అస్సాంలో ప్రవేశించిన పాకిస్తానీలను త్రిప్పిపంపివేయటానికి 1966 సంవత్సరం మార్చి 31వ తేదీ దాటకుండా తుది గడువును నిర్ణయించాలని రాష్ట్రకాంగ్రెసు కమిటీ తీర్మానంలో కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

శిశు సంక్షేమ సంస్థ అధ్యక్షుడుగా రాధారమణ్ ఎన్నిక

న్యూఢిల్లీ, మే 10

భారతీయ శిశు సంక్షేమ సంస్థ అధ్యక్షుడుగా శ్రీ రాధారమణ్ ఎన్నికైనారు. ఈ సంస్థ అధ్యక్ష స్థానంలో శ్రీమతి [illegible] ఇంతవరకు పూర్వం వ్యవహరించారు.

శ్రీమతి పుష్పమెహతా, శ్రీమతి తారాఅలీబేగ్ ఉపాధ్యక్షులుగాను, శ్రీమతి శ్యామ్ కుమారీఖాన్ కార్యదర్శిగాను ఎన్నికైనారు. శ్రీమతి ఇందిరాగాంధీ పేట్రన్‌గా ఉంటారు.

నాసర్‌తో బెన్‌బెల్లా ప్రభృతులు చర్చలు జరిపే సూచన

కైరో మే 10 (పి.టి.ఐ)

జోర్డాన్ నదీజలాలను మళ్ళించాలనే ఇజ్రాయిల్ నిర్ణయంవల్ల నెలకొన్న ప్రమాదకర పరిస్థితినిగురించి అధ్యక్షుడు నాసర్‌తో మూడు అరబ్ రాజ్యాల అధినేతలు చర్చలు జరపగలరని అధికారికంగా తెలుస్తున్నది.

ఇరాక్ అధ్యక్షుడు అరిఫ్, యమన్ అధ్యక్షుడు సలాల్, అల్జీరియా అధ్యక్షుడు బెన్‌బెల్లా ముగ్గురు అశ్వాన్ డామ్ ఉత్సవాలలో పాల్గొంటున్నారు.

శాంతి, సహజీవనాలకై రష్యా, ఈజిప్టు దేశాల ఏకోన్ముఖ కృషి

క్రుశ్చేవ్ గౌరవార్థం ఏర్పాటుచేసిన విందులో నాసర్ అభిభాషణ

కైరో, మే 10

సామ్రాజ్య వ్యతిరేకపోరాటం, నిరాయుధీకరణ శాంతియుత సహజీవనం వంటి అనేకసమస్యల విషయంలో అంతర్జాతీయ రంగంలో సోవియట్ యూనియన్, ఐక్య అరబ్‌రిపబ్లిక్‌ల కృషి ఏకోన్ముఖంగా ఉందని ప్రెసిడెంట్ నాసర్ నిన్నరాత్రి ఇక్కడ సోవియట్ ప్రధాని శ్రీ క్రుశ్చేవ్ గౌరవార్థం ఏర్పాటైన విందులో చెప్పారు.

వివిధ రూపాలలో వున్నసామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో స్వాతంత్ర్యోద్యమాలను బలపరచడం, నిరాయుధీకరణ, విదేశ సైనిక స్థావరాల తొలగింపు అణ్వస్త్రాల ఉపయోగంపై నిషేధం, జాతివివక్షణ నిర్మూలనకు పోరాటం మానవాభ్యున్నతికి సృజనాత్మక కృషి సాగడానికి ఆధారభూతమైన శాంతియుత సహజీవనంవంటి సమస్యలపై మన ఉభయదేశాలకృషి ఏకోన్ముఖంగా సాగుతున్నదని ప్రెసిడెంట్ నాసర్ చెప్పినట్టు కైరో రేడియో ప్రకటించింది.

నాసర్‌తో క్రుశ్చేవ్ సమావేశం

ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాసర్‌తో సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ గతరాత్రి సమావేశమయారు. ముందుగా అనుకోకుండా ఈ సమావేశం జరిగింది.

అధ్యక్షుడు నాసర్ ఏర్పాటుచేసిన విందుకు హాజరవడానికి కొద్దిసేపు ముందు ఈ సమావేశం జరిగింది.

ఈ విందు సందర్భంలో ప్రసంగిస్తూ ఇరుదేశాలమధ్య స్నేహ, సహకారాలను అభివృద్ధి పరచగల మార్గాలపై చర్చలు జరిపేనిమిత్తం తాను ఇక్కడకు వచ్చానని క్రుశ్చేవ్ అన్నారు:

ఆయన ఇంకా ఇలా అన్నారు.

"విదేశీ సేనల నుండి మీకు విముక్తి లభించింది సూయజ్ కాల్వను జాతీయం చేసుకున్నారు. ఆ యుద్ధాల ద్వారానేకాక అన్నివిధాలా ఈ పోరాటానికి మేము సహకరించాం.

"బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ మూడుదేశాలూకలిసి దురాక్రమణ జరిపినప్పుడు సాహసంతో మీరు పోరాటం జరిపారు. సామ్రాజ్యవాద ఏజంటుగా ఇజ్రాయిల్ పనిచేసింది ఆఫ్రికా ఖండంలో బ్రిటన్‌కు ఇదే తొలిపరాజయం" కష్టాలనూ, ప్రమాదాలను అధిగమించగలమనే విశ్వాసం ఐక్య అరబ్ రిపబ్లిక్ ప్రజలకు ఉన్నదనీ. "సోషలిజం"ద్వారా "అరబ్ రాజ్యాలకి గౌరవప్రదమైన సమాజాన్ని నిర్మిస్తున్నారనీ అంతకుముందు మాట్లాడుతూ నాసర్ అన్నారు.

"అటువంటి గౌరవప్రదమైన సమాజ నిర్మాణమే అరబ్ ప్రజల సమైక్యతా సాధనకు చక్కటి మార్గం" అని కూడా నాసర్ అన్నారు.

అమెరికా-రుమేనియా వాణిజ్యాభివృద్ధికి చర్చలు

వాషింగ్టన్, మే 10

ఆర్థిక, వాణిజ్య, రాజకీయ సంబంధాలను మెరుగుపరిచే పద్ధతులపై రుమేనియా, అమెరికామధ్య చర్చలు ఈ నెల 18వ ప్రారంభమౌతాయి.

అమెరికా ప్రతినిధి వర్గానికి అవరెల్ హారిమన్ నాయకత్వం వహిస్తుండడం దృష్ట్యా చర్చలకు ప్రాధాన్యం వున్నట్టు భావించక తప్పదు.

సైప్రస్ విభజనకు తేమియోజా విముఖత

లండన్, మే 10 (నఫెన్)

దేశాన్ని విభజించడం ద్వారా సైప్రస్ సమస్యను పరిష్కరించాలనే ప్రతిపాదనను మధ్యవర్తి సకారితేమియోజా విస్మరిస్తున్నట్టు తెలుస్తున్నది.

సైప్రస్‌లో శాంతి సంస్థాపన పథక స్థూల స్వరూపాన్ని ఆయన రూపొందించారు. గ్రీక్, టర్కీ, జాతీయుల నాయకులతోటి, దౌత్యప్రతినిధుల తోటి ఆయన చర్చలు జరుపుతున్నారు. సమస్యా పరిష్కారంపై తన అభిప్రాయాల గురించి వారి వైఖరి తెలుసుకోవడానికి ఆయన యత్నిస్తున్నట్టు తెలుస్తున్నది.

గ్రీక్ జాతీయులతో సంబంధంలేకుండా జీవించడానికి వీలు కల్పించే పక్షంలో ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే విషయాన్ని గురించి పరిశీలించగలమని అనుమతి పూర్వకంగానే టర్కీ జాతినాయకులు సూచించారు

కాంగ్రెస్‌తో డాంగే వర్గం చేతులుకలిపినట్టు రామమూర్తి ఆరోపణ

కలకత్తా, మే 10

భారత కమ్యూనిస్టు పార్టీ సంఘాను కాంగ్రెస్‌కు అనుకూలంగా డాంగే వర్గం మళ్ళించినదని శ్రీ పి రామమూర్తి నిన్న ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు పార్టీలోని అతివాదవర్గం వారు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ శ్రీ రామమూర్తి పైవిధంగా ఆరోపించారు దేశంలోని ప్రస్తుత ఆర్థిక, రాజకీయ పరిస్థితిని వివరిస్తూ, విప్లవాత్మకమైన పార్టీగా కమ్యూనిస్టు పార్టీ పనిచేయాలంటే సోషలిజమనే నినాదాన్ని కాంగ్రెస్ కారణంగా పార్టీ నాయకులు దారి తప్పిందని ఆయన అన్నారు. దురదృష్టవశాత్తు, కొన్నివిషయాలలో కాంగ్రెస్ విధానాన్నే డాంగే వర్గం కూడా అనుసరిస్తున్నది. పార్టీలో కొంతమంది డాంగే వర్గానికి వ్యతిరేకంగా చాలాకాలంనుండి వ్యవహరిస్తున్నారనీ, "డాంగే వ్రాసిన ఉత్తరాలపై ఇటీవల ఉత్పన్నమైన రభసతో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయి చేరాయనీ ఆయన అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీలోని "విప్లవశక్తుల"తో సహకరించవలసినదిగా సస్పెండయిన 32 మంది నాయకులు విజ్ఞప్తి చేసారని ఆయనఅన్నారు.

జీవితావసర వస్తువుల ధరలపట్ల కాంగ్రెసు ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమం లేవదీయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేసారు.

"సోషలిజాన్ని సాధించవలసినదిగా కాంగ్రెసును మేము కోరము. ధరలను తగ్గించాలని ఆపార్టీని కోరుతున్నాము" అని ఆయన అన్నారు.

కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో ఇంతటి "సంక్షోభ పరిస్థితి" మున్నెన్నడూ ఏర్పడలేదని శ్రీ జ్యోతిబాసు అన్నారు. అతివాదులలో కొంతమంది చైనా అనుకూలురని ఆరోపించినందువల్ల పరిస్థితి స్పష్టంకాలేదు. డాంగే నాయకత్వావగాహన వర్గం అనుసరిస్తున్న విధానం పెట్టుబడిదారులకు దోహదమవుతుందని తన అభిప్రాయమనీ, అందువల్లనే నాయకత్వాన్ని ఆమోదించలేకపోయామనీ ఆయన అన్నారు.

"పెట్టుబడిదారుల కీలుబొమ్మలు"గావలి దారి తప్పిన మార్క్సిస్టు-లెనినిజాన్ని అనుసరించవలసినదిగా పార్టీ కార్యకర్తలకు శ్రీ జ్యోతిబాసు విజ్ఞప్తి చేసారు.

మొరాకో ప్రధానితో భారత ప్రతినిధివర్గం చర్చలు

రబాత్, మే 10

ఆఫ్రికా దేశాలలో సుహృద్భావ పర్యటన జరుపుతున్న భారత ప్రతినిధి వర్గం నిన్నఇక్కడ మొరాకో ప్రధాని శ్రీ అహమ్మద్ బహ్‌నిని కలసు కొని, గంటసేపు ఆయనతో చర్చలు జరిపారు.

అయిదుగురు సభ్యులతో కూడిన ఈ ప్రతినిధివర్గానికి పార్లమెంటు సభ్యుడు శ్రీ సాదిక్ అలీ నాయకుడు.

ఉత్తరప్రదేశ్ పి.సి.సి అధ్యక్ష ఎన్నికలో పోటీతప్పని పరిస్థితి

లక్నో, మే 10

ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికలలో పోటీని నివారించడానికి అవకాశమేమీ కనిపించడంలేదని శ్రీ ఎ. పి. జైన్ ప్రకటించారు.

రాజీప్రతిపాదనపై తాను, శ్రీ బనార్సీదాస్‌తో చర్చలు జరిపినట్టుగా పత్రికలలో వెలువడిన వార్తలు నిరాధారమని పి సి సి అధ్యక్షుడైన శ్రీ ఎ డి జైన్ అన్నారు శ్రీ దాస్ నాకు మిత్రుడు అతను వచ్చి మాట్లాడితే, మేము రాజీ ప్రతిపాదనలను చర్చించినట్టుగా భావించరాదు అని ఆయన అన్నారు.

మంత్రివర్గంలోని వారి గ్రూపేకానీ, ప్రతివర్గంవారు కానీ ఇంకా నామినేషన్లు దాఖలుచేయలేదు అయితే మాజీ ముఖ్యమంత్రి శ్రీ సి బి గుప్త రెవెన్యూ మంత్రి శ్రీ కమలాపతి త్రిపాఠీ మధ్య పోటీ జరగవచ్చు నామినేషన్లు దాఖలు చేయడానికి రేపే కడపటి రోజు.

బీహార్‌లో 5 వేలమంది పాకిస్తానీయుల అక్రమ ప్రవేశం

గయ, మే 10

గత కొన్ని నెలలలో 5 వేల మందికి [illegible] పాకిస్తానీయులు బీహార్ లో అక్రమంగా ప్రవేశించారని భారతీయ జనసంఘ బీహార్ రాష్ట్రశాఖ సమావేశంలో అధ్యక్షుడు శ్రీ [illegible] ప్రసాద్ నిన్న చెప్పారు.

జీవన ప్రమాణాల అభివృద్ధి అవసరం

కాంగ్రెస్ కార్యకర్తల సభలో శ్రీ పాటిల్ అభిభాషణ

బొంబాయి, మే 10

కాంగ్రెసు వాదులు మారుతున్న పరిస్థితులను గుర్తించకపోతే, ప్రజలు భావికాలంలో కాంగ్రెసుకు దూరస్థులవుతారని శ్రీ ఎస్. కె. పాటిల్ నిన్న ఇక్కడ చెప్పారు.

తాజ్‌మహల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెసు కార్యకర్తల ఇష్టాగోష్టి సమావేశంలో శ్రీ పాటిల్ ప్రసంగిస్తూ కార్మికుల రైతుల జీవిత ప్రమాణం హెచ్చుకావటం మిక్కిలి ప్రధానమైన విషయమని అన్నారు కానిదేశం యొక్క సమష్టి అభివృద్ధికి అనుగుణంగా వారి అభ్యున్నతి కూడా రూపొందాలని ఆయన చెప్పారు.

వచ్చే వారం ఇక్కడ జరిగే ఎఐసిసి సమావేశం సందర్భంలో, సోషలిస్టు ట్రేడు యూనియను లు సంకల్పించిన "బొంబాయిబంద్" బెదరింపును గురించి శ్రీ పాటిల్ ప్రస్తావిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు రాజకియ పార్టీలచేత ప్రేరేపణ పొందటం వల్ల, కాంగ్రెసు "ఈ కార్యక్రమాలను ప్రతిఘటిస్తుందని" చెప్పారు.

కార్మికులకు న్యాయం జరగాలని తాను త్రికరణశుద్ధిగా కోరుతున్నట్టు తెలిపారు. కాని ప్రతిపక్ష పార్టీల నాయకులే, కార్మిక వర్గాలకుకూడా నాయకత్వం వహించి కార్మికవర్గాలను "ఎటువంటి కార్యాచరణానికి పూనుకోవటంలోను పెడతోవ పెట్టకూడదని" ఆశిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

ఎ.ఐ.సి.సి.కి వ్యతిరేకంగా ప్రదర్శనలుజరపటానికివ్యతిరేకిస్తానని శ్రీ పాటిల్ చెప్పారు. ఎందువల్లనంటే ట్రేడ్ యూనియన్ కోరిన కోరికలు తీరనందువల్ల కలిగిన అసంతృప్తికి ఎ. ఐ. సి. సి బాధ్యత వహించదు.

శ్రీ పాటిల్ కాంగ్రెసు సంస్థ యొక్క భవిష్యత్తును గురించి ప్రస్తావిస్తూ కాంగ్రెసు విధానాల కారణంగా ధనికులు ఆర్థిక సహాయం చేయకపోతే సామాన్యప్రజానీకం వద్ద నుండి అవసరమైన ఆర్థిక స్తోమతను సేకరించవలసిన బాధ్యత కాంగ్రెసు వాదులపైనవుందని చెప్పారు.

జైపూర్, మే 10

కాశ్మీర్‌పై భారత పాకిస్తాన్‌ల మహాసమాఖ్యనుగూర్చిన ఆలోచనను మొగ్గలోనే తుంచివేయటం మంచిదని, మాజీ రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నిన్న ఇక్కడ ఉద్ఘోషించారు. శ్రీ మీనన్ ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ పైవిధంగా అన్నారు.

విజయవాడలో జాతీయ సత్యాగ్రహ సమితి అత్యవసర సమావేశం

హైదరాబాద్, మే 10

సత్యాగ్రహోద్యమాన్ని పటిష్ఠపరచి ఉద్యమాన్ని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తీవ్రతరం చేయడానికి గైకొనవలసిన చర్యలగురించిచర్చజరిపే నిమిత్తం, జాతీయ సత్యాగ్రహ సమితి అత్యవసర సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు విజయవాడలో జిల్లా స్వతంత్రపార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

నాల్గవ ప్రణాళికలో గ్రామీణ రంగానికి ఇతోధిక ప్రాధాన్యం

న్యూఢిల్లీ, మే 10

పూర్వపు ప్రణాళికలకంటె నాల్గవ ప్రణాళిక బృహత్తరంగా ఉండాలనీ, వ్యవసాయ, గ్రామీణ రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇవ్వాలనీ ప్లానింగ్ కమిషన్ నేడు ప్రధాని నెహ్రూ అధ్యక్షతన సమావేశమై, స్థూలంగా అంగీకరించినట్టు తెలుస్తున్నది.

నాల్గవ ప్రణాళికను రూపొందించడానికి సంబంధించిన విధానాల గురించి కమిషన్ రెండు గంటలసేపు చర్చించింది. వివిధ రకాల కార్యక్రమాలు ఆర్థికంగాను, సాంకేతికంగానూ ఎంతవరకూ సాధ్యమనే విషయంపై నివేదికను సమర్పించవలసినదిగా ఉపసంఘాలను కోరాలనికూడా ప్లానింగ్ కమిషన్ నిర్ణయించింది.

నాల్గవ ప్రణాళిక పరిమితిపై నేటి సమావేశంలో ఎట్టి నిర్ణయానికి రానట్టు తెలుస్తున్నది.

అలీన రాజ్యాలసభ స్థాయీసంఘసమావేశం

కైరో, మే 10

అలీనరాజ్యాల ద్వితీయ మహాసభ సన్నాహాలకుసంబంధించిన స్థాయీసంఘ తొలి సమావేశం నిన్నఇక్కడ జరిగింది. ఐక్యఅరబ్ రిపబ్లిక్ ప్రతినిధిశ్రీసయ్యదు అమీన్‌నమీ సమావేశానికి అధ్యక్షత వహించారు.

10 దేశాలకుసభ్యత్వంకలిగినస్థాయీ సంఘంలో మరిఇద్దరు కొత్తసభ్యులను చేర్చుకొనే విషయమై సమావేశం నిర్ణయిస్తుంది అక్టోబర్ నెలలో ఇక్కడ జరుగనున్న అలీనరాజ్యాల మహాసభకు ఆహ్వానాలు పంపేవిషయంలో కూడా నిర్ణయంగైకొంటారు

ఐక్యఅరబ్ రిపబ్లిక్‌లో భారతరాయబారి శ్రీ ఆజిం హుసేన్ భారతప్రతినిధిగా సమావేశానికి హాజరయినారు.

వివాహాది శుభ సందర్భాలకు

ఉలెన్-రేయాన్ సూటింగ్స్

100 % టెరీన్

పురుషులకు కావలసిన ఇతర వస్త్రాలు

వచ్చాయి

ఆర్. పె. ఫోజి

హెచ్. ఓ : పత్థర్‌గట్టి, హైదరాబాద్

బ్రాంచీలు :

స్టేషన్‌రోడ్, అబిద్ సర్కిల్ హైదరాబాద్

సుల్తాన్ బజార్, చిక్కడపల్లి హైదరాబాద్.

(BAP.)

రష్యా-చైనా సరిహద్దు వివాదం:

చర్చలు జరపాలనే మాస్కో సూచనకు ఆరోపణలతో పెకింగ్ సమాధానం

పెకింగ్, మే 10 (రాయిటర్)

చైనాతో తమ దేశానికి కల సరిహద్దులలో "సంఘర్షణలు" చెలరేగే ప్రమాదం ఉన్నదని అందువల్ల సరిహద్దు సమస్యపై సంప్రతింపులు జరపాలని ప్రతిపాదిస్తూ లోగడ రష్యా వ్రాసిన రహస్య లేఖను నవచైనా వార్తా సంస్థ నిన్న ప్రచురించింది.

ఈవిషయంపై సంప్రతింపులు జరపడానికి ఇరు పక్షాలూ అనుకూలాభిప్రాయం ప్రకటించాయని గత నవంబర్ 29వతేదీన వ్రాసిన లేఖలో పేర్కొన్నట్టు ఈ వార్తా సంస్థ తెలిపింది. ఈ వివాదానికి సంబంధించిన ఒక పత్రాన్ని మీకు పంపుతున్నాము "అని కూడా దానిలో పేర్కొన్నారు.

జారిస్ట్ ప్రభుత్వ దురాక్రమణ విధానాన్ని అనుసరించినదనీ అన్యాయమైన ఒడంబడికలను చైనాపై రుద్దినదనీ చైనా చేసిన ప్రకటనలను ఈ లేఖలో రష్యా ప్రస్తావించింది. సోవియట్ యూనియన్‌లోని తూర్పు భాగంలో కల కొన్ని ప్రాంతాలను జార్ చక్రవర్తుల కాలంలో రష్యాకుచైనా ధారాదత్తం చేసింది.

సరిహద్దుల నిర్ణయంలో నిరంకుశ విధానాన్ని అనుసరించిన జార్ చక్రవర్తుల చర్యను తాము సమర్థించబోమనీ బలప్రయోగం ద్వారా ఇతర దేశాలలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకొన్న చైనా మాజీ చక్రవరుల చర్యను చైనాకూడా సమర్థించబోదని ఆశిస్తున్నామనీ రష్యా తన లేఖలో పేర్కొన్నది.

అయితే చరిత్రాత్మకంగా ఏర్పడి ఇప్పుడు ఉన్న సరిహద్దులను గుర్తించకుండా ఉండజాలమని కూడా రష్యా పేర్కొన్నది.

రష్యా తన లేఖలో ఇంకా ఇలా పేర్కొన్నది.

"దీనిని విస్మరించడానికి ఏ విధంగా యత్నించినప్పటికీ అపార్థం చేసుకోవడానికి, సంఘర్షణ చెలరేగడానికి అవకాశం ఉన్నది. ఏ విధమైన సరిహద్దు వివాదాన్ని అయినా పరిష్కరించుకోగల అవకాశాలున్నవని [illegible] ఉన్నాయి. ఆవిధంగా పరిష్కరించుకోవడం ద్వారా రెండు సోషలిస్ట్ రాజ్యాల మధ్యగల మైత్రీభావాన్ని చూ[illegible]".

చైనా భూ[illegible]న్ని రష్యా ఆక్రమించుకొన్నదనీ, సరిహద్దులలో సంఘర్షణలను రెచ్చగొడుతున్నదనీ అల్పసంఖ్యాక వర్గాలను పెకింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నదనీ చైనా ఆరోపిస్తూ వ్రాసిన ఒక లేఖ ఇక్కడ లభ్యమైనది

బొంబాయిలో అబ్దుల్లాకు హజ్ యాత్రికుల స్వాగతం

బొంబాయి, మే 10

రెండు రోజుల పర్యటనకై ఇక్కడికి వచ్చిన షేక్ అబ్దుల్లా నేటి ఉదయం, హాజ్ యాత్రను ముగించుకొని ఓడలో బొంబాయికి చేరిన కాశ్మీర్ వాణిజ్య ప్రముఖుడు ఆయన జేష్ఠ సోదరుడు షేక్ మోహి. ఉల్ దీన్‌ను కలుసుకున్నారు.

హాజ్ యాత్రను ముగించుకుని స్వదేశాభిముఖులైన యాత్రికుల మిత్రులు, బంధువులు బెల్లార్డ్ పైర్ వద్ద గుమికూడారు. ఈ జట్టులో 1600 మంది యాత్రికులు తిరిగివచ్చారు. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న మొగల్ లైన్ స్టీమరు "ముజఫరి" ఓడపై ఈ యాత్రికులు జెడ్డానుండి బొంబాయికి తిరిగి వచ్చారు

షేక్ అబ్దుల్లా ఆయన సోదరుడికి స్వాగతం చెప్పటానికి 'ముజఫరి' ఓడలో ప్రవేశించగానే బహుళ సంఖ్యాకులైన యాత్రికులు, 538 మంది కాశ్మీర్ దేశస్థులు, 70మంది ఓడసిబ్బంది హర్ష వదనాలతో 'షేక్ అబ్దుల్లా జిందాబాద్: కాశ్మీర్ జిందాబాద్' అనేనినాదాలతో ఆయనకు స్వాగతం చెప్పారు

షేక్ అబ్దుల్లా ఆయన జేష్ఠ సోదరుడు షేక్ మోహి ఉల్, దీన్ తో కూడా కలిసి రేపటిదినం న్యూఢిల్లీ వెడతారు.

ప్రారంభంలో షేక్ అబ్దుల్లా బెల్లార్డ్ పైర్ కు చేరగానే, బొంబాయిలో కాశ్మీర్ ప్రభుత్వ వాణిజ్య ప్రతినిధి డాక్టరు ఎస్.ఎస్. నిషాత్, బొంబాయి మాజీ మేయర్, హాజ్‌పోర్టు కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీ ఇ.ఎ. బందూక్ వాలా ఆయనకు స్వాగతం చెప్పారు.

బల్గేరియా ప్రజలకు పెన్షన్ పద్ధతులు

సోఫియా, మే 10

బల్గేరియాలో ప్రతికార్మికునికి, ఉద్యోగికి, రైతుకూ పెన్షన్ పొందే హక్కు ఉన్నది.

25 సంవత్సరాల సర్వీసు, 60సంవత్సరాల వయస్సు వచ్చిన ప్రతి పురుషునికీ 20 సంవత్సరాల సర్వీసు 55వ సంవత్సరాల వయస్సు వచ్చిన ప్రతి స్త్రీకి పెన్షన్ లభిస్తుంది. కొన్ని రకాల వృత్తుల్లో పని చేసే వారికి 20 సంవత్సరాల సర్వీసు వుండి, పురుషునికి 55 సంవత్సరాల వయస్సు స్త్రీలకు 50 సంవత్సరాల వయస్సురాగానే పెన్షన్ యివ్వబడుతుంది. కష్టతరమైన కొన్ని రకాలపనుల్లో పనిచేసేవారికి 15సంవత్సరాల సర్వీసు పూర్తయి పురుషులకు50 సంవత్సరాలు, స్త్రీలకు 45 సంవత్సరాలు నిండగానే పెన్షన్ లభిస్తుంది. ఐదుగురు పిల్లలనుకని వారిని 8సంవత్సరాల వరకు పెంచిన తల్లులకు 15 సంవత్సరాల సర్వీసు పూర్తయి 40 లేదా 45 సంవత్సరాల వయస్సు నిండగానే పెన్షన్‌లభిస్తుంది. అవసరమైనవయస్సు పూర్తి కాక ముందే యెవ్వరికైనా పెన్షన్ యివ్వవలసి వచ్చినప్పుడువారికి పెన్షన్ కొద్ది తక్కువగా లభిస్తుంది.

అశక్తులైనవారికి పెన్షన్ ఇవ్వవలసి వచ్చినప్పుడు 25 సంవత్సరాల లోపు వారికి మూడు సంవత్సరాల సర్వీసూ 25 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఐదు సంవత్సరాల సర్వీసు ఉండవలసి ఉంటుంది.

పెన్షన్లకోసం బల్గేరియా శ్రామిక ప్రజలు ఏమీ చెల్లించ నవసరం లేదు పెన్షన్లకయ్యే ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుంది. ఈ సంవత్సరం బల్గేరియా ప్రభుత్వ బడ్జెట్ లో 184-2 మిలియన్ లెవాల మొత్తం పెన్షన్లకోసం కేటాయింపబడింది ఇది 1952లో కేటాయింపబడిన దానికంటే 17 రెట్లుఅధికం.

జీతానికి 80శాతం పెన్షన్‌గా లభిస్తుంది తక్కువ వేతనాల సందర్భంలో దాదాపు వేతనానికిసమానంగా పెన్షన్ ఉంటుంది.

హుసేన్‌సాగర్‌లో యువకుని శవం

హైదరాబాద్, మే 10

హుసేన్‌సాగర్ లో నిన్న పాతికేళ్ళ యువకుని శవం కనుపించింది.

పోలీసులు శవాన్ని బయటకు తీసి. శవపరీక్షకొరకు ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి పంపారు.

రడ్‌ఫన్ తెగలతో పోరాటంలో 30 మంది బ్రిటిష్ సైనికుల మృతి

ఏడెన్, మే 10

రడ్‌ఫన్ కొండలప్రాంతంలో స్థానిక తెగల ప్రజలు నిన్న బ్రిటిష్ సైనికులతో సాగించిన వీరోచిత పోరాటంలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ఒక పసిబిడ్డ మరణించారని సనా రేడియో ప్రకటించింది.

ఈ పోరాటంలో 30 మంది బ్రిటిష్ సైనికులు మరణించారనీ మరి 20 మంది గాయపడ్డారని రేడియో పేర్కొనింది.

అయితే, బ్రిటిష్ సైనిక కార్యాలయం ప్రతినిధి ఈ వార్తలను ఖండిస్తూ, బ్రిటిష్ సైనికులు ఇద్దరు మరణించారనీ, మరి ఇద్దరిజాడ తెలియడంలేదని అన్నారు.

రడ్‌ఫన్‌కొండల ప్రాంతంలో తెగలవారికి యెమన్, ఐక్యఅరబ్, రిపబ్లిక్‌ల నుండి నైతిక సహాయం. ఆయుధ సహాయం అందుతున్న విషయమై సందేహం లేదని బ్రిటిష్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ మేజర్ జనరల్ ఫిట్జారీ బల్‌ఫోర్ అన్నారు.

"కరీంనగర్ డిస్ట్రిక్ట్ డైరెక్టరీ" ప్రచురణకు నిర్ణయం

కరీంనగర్ మే 10

కరీంనగర్ జిల్లాకు సంబంధించిన చారిత్రక, సాహిత్య, రాజకీయ సామాజిక విజ్ఞాన వ్యాసాలు, ఫోటోలు, జిల్లా పరిషత్తు, పంచాయతీ సమితులు, గ్రామ సీటీ మునిసిపాలిటీలు, సహకార పదితర సంస్థల నివేదికగల "కరీంనగర్ డిస్ట్రిక్ట్ డైరెక్టరీ" అనే పుస్తకాన్ని తెలుగు, ఉర్దూ భాషలలో వేరువేరుగా ప్రచురించాలని నిర్ణయించారు. దీనికిగాను సంపాదక వర్గాన్ని ఏర్పాటుచేశారు. సంపాదకవర్గములో శ్రీ కమాల్ కరీంనగరి, శ్రీ సత్యనారాయణబోమి, శ్రీ యం. సచితానందరావు (అడ్వకేట్) శ్రీ బి. వెంకటరామరావు సభ్యులు.

నల్లగొండ జిల్లా కమ్యూనిస్టుపార్టీ సమావేశం

17 మంది సభ్యుల తొలగింపు

హైదరాబాద్, మే 10

భారతకమ్యూనిస్టు పార్టీ నల్లగొండ జిల్లా కౌన్సిల్ ఈనెల 5, 6 తేదీలలో కనగొల్లు గ్రామంలో సమావేశమైంది. సమావేశ కార్యక్రమాలు నిర్వహించటానికి శ్రీయుతులు వి నారాయణరావు డి. సత్తిరెడ్డి, చింతలపూడి రాములు. ఎన్నికైనారు.

జిల్లా కౌన్సిల్ నుండి దాదాపు 30 మంది సభ్యులు. బ్లాకు కార్యదర్శులతో కూడా కలిపి 80 మంది ఆహ్వానితులు. ప్రముఖ కార్యకర్తలు ఈసమావేశంలో పాల్గొన్నారు

శ్రీయుతులు వై. వి. కృష్ణారావు, రావి నారాయణరెడ్డి (పార్లమెంటు సభ్యుడు) ప్రదేశ్ కౌన్సిల్ తరఫున ఈ సమావేశంలో పాల్గొని, "డాంగే లేఖలు". 'చీలికలు' సంకల్పించిన వారిని గురించి జాతీయ కౌన్సిల్ రాష్ట్ర కౌన్సిల్ చేసిన తీర్మానముల వివరాలు విశదీకరించారు.

ఈ సంఘటనలకు సంబంధించినపూర్తి వివరాలు ఆకళింపుచేసుకొనినతరువాత ఈ సమావేశంలో జాతీయకౌన్సిల్. రాష్ట్ర కౌన్సిల్ చేసిన తీర్మానాలను సమర్థిస్తూ తీర్మానించారు.

పదిహేడుమంది కౌన్సిల్ సభ్యులను బ్లాకు కార్యదర్శులను కౌన్సిల్ సమావేశంలో సస్పెండు చేశారు.

హుజూర్ నగర్ కోదాడ, మిర్యాలగూడెం, పెదవూరు ఆత్మకూరు,నగరం, మునుగోడు, నకిరేకల్లు నల్లగొండ బ్లాకు కమిటీలు పోటీ సంస్థయొక్క కార్యక్రమాలలో పాల్గొనినందుకు ఏకగ్రీవంగా వీటిని రద్దుచేస్తూ తాలూకా స్థాయిలో ఆర్గనైజింగు కమిటీలను ఏర్పాటుచేయాలని జిల్లా కార్యవర్గాన్ని ఆదేశించారు.

ఈ సంవత్సరం జూన్ నెలలో తాలూకాల, బ్లాకుల సమావేశం జరుపాలని, జులై నెలలో జిల్లా సమావేశం జరుపాలని నిర్ణయించారు.

నెలాఖరులో నల్గొండ జిల్లా వెనుకబడిన తరగతుల సభ

నల్గొండ. మే 10

శ్రీ జి. పెదబాలయ్య, అధ్యక్షతన ఆహ్వానసంఘ కమిటీసభ్యుల సమావేశం జరిగింది. జిల్లా వెనుకబడిన తరగతుల ద్వితీయ మహాసభ నిర్వహించేనిమిత్తం సభాకార్యక్రమం ఈదిగువ నుదహరించిన సభ్యులను ఎన్నుకున్నారు,

ఆర్థిక సంఘం

శ్రీ పి. గోపాల్, శాయిని శ్రీసేలం, పి.రాజలింగం, జి. పెదబాలయ్య గోగుల ఎల్లయ్య, మాటూరు బాలనసింహ్మం,

ప్రచారశాఖ

శ్రీ బి. అర్జున్. కె ఏకయ్య. డాక్టర్ టి. కృష్ణా. మన్నెం మల్లయ్య, జి. రాంచంద్రయ్య, జి. పెదబాలయ్య, యం, వి. చారి, పురుషోత్తంచారి. షేక్‌లతీఫ్ సాబు సత్తుపల్లి దేవయ్య ఈ నెలఖరులో మహాసభ జరపాలని ఆహ్వానసంఘం తీర్మానించింది.

హనుమాన్ జంక్షన్‌లో అగ్ని ప్రమాదం: 12 పాకల దగ్ధం

హనుమాన్ జంక్షన్ మే 10

ఇటీవల యిచ్చటకు ఒక మైలు దూరానగల నూడివీడు రైల్వే స్టేషను వద్ద అగ్నిప్రమాదం మూలంగా 12 పాకలు తగులబడి పోయాయి. ఏలూరు నుండి అగ్నిమాపక దళంవారు వచ్చి మంటలను ఆర్పడానికి తోడ్పడ్డారు.

రెండవ శతాబ్దంనాటి రోమన్ విగ్రహం

సోఫియా, మే 10

బల్గేరియాలో విదిన్ జిల్లాలోని అర్చార్ గ్రామసమీపంలో వున్న ప్రాచీన రోమన్ నగరం రసియారియా శిథిలాల్లో ఒక మీటర్ అడుగున మనిషెత్తు విగ్రహం ఒకటి బయట పడింది.

విగ్రహానికి తలలేదు ఈ స్త్రీమూర్తి రోమన్ దుస్తులను ధరించివున్నది. ఇది క్రీస్తు శకం రెండవ శతాబ్దపు ద్వితీయ భాగానికి చెందినదై వుంటుందనిభావించబడుతున్నది,

ధరల అదుపుదలకు విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని కాశ్మీర్ ప్రభుత్వం యోచన

శ్రీనగర్, మే 10

జీవితావసర వస్తువుల ధరలను అదుపులో నుంచటానికి రాష్ట్రంలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని జమ్మూ, కాశ్మీర్ ప్రభుత్వం యోచిస్తోంది.

ఈ కమిటీలు రాష్ట్రంలోనిమార్కెట్ ధోరణులనుకూడా పరిశీలిస్తాయి

జీవితావసర వస్తువులను సరసమైన ధరలకు వినియోగదారులకు సరఫరా చేయటానికి లోయప్రాంతంలో చౌకడిపోలు, సహకార స్టోర్సు ఏర్పాటుచేయటానికి ఒక పథకానికి ప్రభుత్వం తుదిమెరుగులు దిద్దుతోంది.

మే 23న వేములవాడ గ్రంథాలయ తృతీయ వార్షికోత్సవం

వేములవాడ, మే 10

కరీంనగర్ జిల్లాలోని వేములవాడ రవీంద్ర యువజన గ్రంథాలయం సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన శ్రీజి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశములో తీర్మానించిన ప్రకారం ఈ నెల 23,24 తేదులలో గ్రంథాలయ తృతీయ వార్షికోత్సవం జరపాలని నిర్ణయించారు.ఈసందర్భమున సారస్వత సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించాలని తీర్మానించారు. కరీంనగరం జిల్లాలోని రచయితలను పరిచయం చేయడానికి జిల్లా సారస్వత ప్రదర్శనం ఏర్పాటు చేశారు. జిల్లాలోనిరచయితలు తమపరిచయంతోపాటు తాము రచించిన పుస్తకాలను కార్యదర్శికి 20వ తేదీలోగా పంపాలి.

వనపర్తిలో నృత్యనికేతన్ బృందం భరత నాట్యం

మహబూబ్‌నగర్, మే 10

నటరాజ రామకృష్ణ పర్యవేక్షణ క్రింద కొనసాగుతున్న నృత్యనికేతన్ విద్యార్థులు ఈ నెల 7న వనపర్తిలో ప్రాథమిక పాఠశాలసహాయార్థం భరత నాట్యం ప్రదర్శించారు.

కన్నాంబ మృతికి నాటకకళాపరిషత్ సంతాపం

హైదరాబాద్. మే 10

సుప్రసిద్ధ నటీమణి, చిత్రనిర్మాత శ్రీమతి పసుపులేటి కన్నాంబ మరణానికి ఆంధ్రనాటకకళాపరిషత్తు అధ్యక్షుడు శ్రీఎం. ఆర్. అప్పారావు సంతాపం వెలిబుచ్చుతూ యిలా ప్రకటించారు.

శ్రీమతి కన్నాంబ మరణవార్త విచారం కలిగించింది. నాటకరంగస్థలంపైన చలనచిత్రాలలోను, ఆమెనటించిన పాత్రలు మిక్కిలిప్రతిభావంతమైనవి. వాటిని ఆమెమిక్కిలిసమర్థతతోనటించి, ఉత్తమనటీమణిగారాణించటం విశేషమైన గర్వకారణం, దాదాపు, 160 తెలుగు తమిళ చిత్రాలలో నటించి, ఆమె తెలుగుచలనచిత్రకళకు అద్వితీయమైన శోభను కలిగించింది, కళాపరిషత్తు సదస్సులో ఆమె ఉత్తమనటిగా సత్కారం పొందింది. ఆమె అస్తమయంతోతెలుగుదేశం ఒక సమర్థురాలైన నటీమణిని కోల్పోయింది.

కార్పొరేషన్ ఎన్నికలకు కమ్యూనిస్టు అభ్యర్థుల నిర్ణయంపై చర్చలు

హైదరాబాద్, మే 10 (ఏ.ఎన్.ఎస్)

మునిసిపల్ కార్పొరేషన్‌కు జరగనున్న ఎన్నికలలో అభ్యర్థులను నిలబెట్టడంపై చర్చలు జరిపే నిమిత్తం నగర కమ్యూనిస్టు పార్టీ సమితి కార్యవర్గం నిన్న ఉదయం సమావేశమైనది.

అభ్యర్థుల జాబితాపై యునైటెడ్ సిటిజన్స్ కమిటీ తుది నిర్ణయం గైకొంటుంది. పార్టీ తరపున శ్రీయుతులు మఖ్దూమ్ మొహియుద్దీన్ కె.ఎల్. మహేంద్రలు ఈ కమిటీలో ప్రాతినిధ్యం వహిస్తారు.

బహిరంగ సభను ఏర్పాటు చేయడంలో నగరపార్టీ సమితి సభ్యులు కొంతమంది ప్రముఖపాత్ర వహించడాన్ని కార్యవర్గం తీవ్రంగా పరిగణించింది. ఆసభకు శ్రీ సుందరయ్యను ఆహ్వానించారు.

ఈ సభను నిర్వహించిన ప్రముఖులలో [illegible] శ్రీయుతులు టి.వి. కృష్ణనాయర్, కె. శ్రీనివాసరావు, జి. రామన్‌నాయర్ కూడా ఉన్నారనీ, శ్రీ వలామ్‌షహీది దీనికి అధ్యక్షత వహించారనీ కార్యవర్గం పేర్కొన్నది.

వీరినందరినీ పార్టీ నుండి బహిష్కరించవలసినదిగా సమితికి సిఫార్సు చేయాలని కార్యవర్గం నిర్ణయించింది.

సమితి ఈనెల 19వ తేదీన సమావేశమవుతుంది.

లావోస్‌లో మిశ్రమ ప్రభుత్వానికి అమెరికా మద్దతు: జాన్సన్ హామీ

న్యూయార్క్, మే 10 రాయిటర్

లావోస్ తాటస్థ్యంపై జెనీవాలో కుదుర్చుకొన్న ఒప్పందాలకు లోగడ వలెనె ఇకముందుకూడా అమెరికా పూర్తిగా కట్టుబడి ఉండగలదని పేర్కొంటూ ఆదేశ రాజుకు లేఖవ్రాసినట్టు అమెరికా అధ్యక్షుడు జాన్సన్ నిన్నఇక్కడ ప్రకటించారు.

ప్రిన్స్‌సౌవన్నఫౌమా నాయకత్వాన గల మిశ్రమ ప్రభుత్వాన్ని అమెరికా బలపరుస్తున్నది.

ఇతరుల మొండివైఖరివల్ల, అతిక్రమణలవల్ల జెనీవా ఒప్పందాలను పూర్తిగా అమలువరచే కార్యక్రమానికి విఘాతం కలిగినదని జాన్సన్ తన లేఖలో పేర్కొన్నారు

సమైక్యతా సాధనకు లావోస్ రాజు చేసే కృషిని పూర్తిగా సమర్థించగలమని జాన్సన్ హామీ ఇచ్చారు.

బల్గేరియాలో చలన చిత్ర పరిశ్రమ

సోఫియా మే 10

బల్గేరియన్ సులభ విజ్ఞాన చలనచిత్ర స్టుడియోలు 1964లో నిర్మిస్తున్న చలనచిత్రాలన్నీ బల్గేరియాలో జరిగిన సోషలిస్టు విప్లవం 20వ వార్షికోత్సవానికి అంకితం చేయబడుతాయి. ఇప్పటి వరకు "1944-45లో నాజీలకు వ్యతిరేకంగా పోరాడిన బల్గేరియన్ సాయుధ బలాల అడుగుజాడల్లో","7,250,000 ఎకరాల భూమిని సాంద్ర వ్యవసాయంలోకి తేవటానికి పోరాటం," "రేడియో పరిశ్రమలో అద్భుతమైన నూతన విజయాలు" మొదలైన చలన చిత్రాలు నిర్మింపబడ్డాయి "సోవియట్ దేశంతో వైజ్ఞానిక, సాంకేతిక సహకారం "అనే చిత్రమూ." సమారా పతాక అనే చిత్రమూ యీ వార్షికోత్సవం కొరకు తయారు చేయబడుతున్నాయి ఈ రెండు చిత్రాలు మాస్కో సులభ విజ్ఞాన చలనచిత్ర స్టుడియో సహకారంతో తయారవుతున్నాయి

బల్గేరియా, జర్మనీ ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లమధ్య ఆర్థిక సహకారానికి సంబంధించిన మరొక చలనచిత్రం బల్గేరియన్, జర్మనీ చలన చిత్రరంగ కార్యకర్తలచేత సమష్టిగా తయారుచేయబడుతుంది.

ఏసంవత్సరానికి ఆసంవత్సరం బల్గేరియన్ సులభవిజ్ఞాన చలన చిత్రాలు బల్గేరియాలో నేగాక విదేశాలలోకూడా బహుళ ప్రజాదరణనుపొందుతున్నాయి వాటికి గిరాకీ యెక్కువవుతున్నది 1963లో బల్గేరియానుండి విదేశాలకు 33 సులభవిజ్ఞాన చలన చిత్రాలు పంపబడ్డాయి మార్సెల్స్‌లో జరిగిన చలన చిత్రోత్సవంలో సుందరమైన వితోషా పర్వతానికి సంబంధించిన చలన చిత్రానికి తృతీయ బహుమానమూ, ఒక పతకమూ. చరిత్ర అడుగుజాడల్లో అనే చలన చిత్రానికి గౌరవ డిప్లొమా లభించాయి. 1963వ వసంతకాలంలో వర్నాలో జరిగిన చలన చిత్రోత్సవంలో "రక్తం యెుక్క నయంచేసే గుణాలు" అనే చిత్రానికి ప్రథమ బహుమతి "దాహం" అనే చిత్రానికి ద్వితీయ బహుమతి లభించాయి

బల్గేరియన్ వైజ్ఞానికస్లైడ్లకు కూడా విదేశాల్లో గిరాకీబాగా పెరుగుతున్నది 1963లో జలాంటి స్లైడు 1,000,000 తయారు చేయబడ్డాయి

బల్గేరియన్ సులభ విజ్ఞాన చలనచిత్ర స్టూడియో పదకొండు సంవత్సరాలుగా పని చేస్తున్నది ఈ కాలంలో 600 చలన చిత్రాలు ఉత్పత్తి చేయబడ్డాయి వీటిలో గత సంవత్సరం తయారు చేయబడిన చలనచిత్రాలు 78.

టర్కీ మంత్రి నాగార్జున సాగర్ సందర్శన

హైదరాబాద్, మే 10,

టర్కీ గ్రామీణాభివృద్ధి, సామాజికాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ లోబిట్ యర్డోగ్లు ఈనెల 5వ తేదీ నాగార్జున సాగర్ ప్రాజెక్టును సందర్శించారు.

చీఫ్ ఇంజనీరు శ్రీరంగనాధస్వామి, అతిథికి స్వాగతంచెప్పి, ఉన్నతాధికారులను ఆయనకు పరిచయం చేసారు.

డాక్టర్ యర్డోగ్లు, చీఫ్ ఇంజనీర్ తో కలసి డామ్ చూసి. ఈ బృహత్తర నిర్మాణం చూసినందుకు ఆనందం కలుగుతున్నదని అన్నారు.

పంచాంగం

సోమవారం

11-5-1964

శ్రీ క్రోధి, నిజవైశాఖ శుద్ధ చతుర్దశి ఉదయం 6.6 వరకు. ఉపరి అమావాస్య రాత్రి 2.22వరకు. భరణి రాత్రి 12.42 వరకు వర్జ్యం పగలు 10.46 మొదలు 1.22 వరకు అమావాస్య తిథి.

వ్యాపారస్తులకు; వెండి బంగారాలు మంది. ప్రత్తినూలు. నిలకడ, మూనెలు వేరుశెనగ పప్పు మంది.

రైతులకు:- మామూలు పనులు చూచుకొనుట మంచిది.

మంచిచెడ్డలు:- ప్రయాణాలకు అధికారులతో వ్యవహారించుటకు. శుభకార్య నిర్ణయాలకు డబ్బులావాదేవీలకు మంచిదికాదు.

అదృష్ట సంఖ్యలు;- 2-1-7

ఏ. జి. కార్యాలయం సాహిత్య సంఘంలో రచయితల సమావేశం

హైదరాబాద్, మే 10

ఉద్యోగ నిర్వహణలో మేఘాచ్ఛాదితమైన వాతావరణంలో ప్రత్యేకంగా ఇటువంటి మీ శాఖలో సాహితీ సంపన్నులు మేధావులు కనిపించటం ఆహ్లాదకరం అని శ్రీ పచ్యాలరంగనాధరావు నిన్న, అకౌంటెంటు జనరల్ కార్యాలయం సాహిత్య సంఘం "రంజని" యాజమాన్యం క్రింద ఏర్పాటుచేసిన రచయితల సంఘంలో ఉపన్యసిస్తూ చెప్పారు,

శ్రీయుతులు టి. భద్రిరాజు, ఎన్. ఎస్. ఆర్. కోటేశ్వరరావు, టి. విశ్వనాథం, ఆర్. ప్రకాశరావు, జి. ఎల్. నరసింహారావు, చెల్లయ్యా, టి. శివరావు ఎ. రఘునాధరావు ఎస్. బలరామకృష్ణ, జి, నాగన్న, బి. కె ఎల్.ఎన్ ఆచార్య తమ రచనలు చదివారు, కార్యదర్శి వందన సమర్పణ చేశారు.

బ్రిటన్‌నుండి క్యూబా మరి 500 బస్సులు కొనుగోలు చేసే సూచన

లండన్. మే 10

బ్రిటన్ నుండి క్యూబా మరి 500 బస్సులను కొనుగోలు చేసే అవకాశం ఉన్నది.

లీలాండ్ మోటార్స్ సంస్థ అధిపతి సర్ విలియంస్ బ్లాక్ ఈ విషయాన్ని నిన్న ప్రకటించారు. గత జులైలో 450 బస్సుల కొనుగోలుకు క్యూబా ఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొన్నది.

బల్గేరియాలో పోలియో వ్యాధినిర్మూలన

సోఫియా. మే 10

బాలల పక్షవాతవ్యాధి యెంతటి భయంకరమైనదో సోఫియా తదితర బల్గేరియన్ పట్టణాలలోని ప్రజలకు బాగా తెలుసు. కొన్ని సంవత్సరాల క్రితంవరకూ కూడా అనేక వందల మంది యీ వ్యాధితో చనిపోవటమో లేక వికలాంగులు కావటమో జరుగుతూ వుండేది. ఈ వ్యాధిని నిర్మూలించటానికి యిదివరకు యెన్ని ప్రయత్నాలు జరిగినా అవన్నీ విఫలమవుతూ వచ్చాయి

1957లో డాక్టర్ సాల్క్ కనిపెట్టిన అమెరికన్ టీకాలమందు వాడటం మొదలైన తర్వాతనే యీవ్యాధినుండి ప్రమాదం కొంతవరకూ తగ్గింది. ఈ వ్యాధి 1955లో 1069మందికి సోకగా 1958-1959 మధ్య మూడువందల మందికిమాత్రమే సోకింది.

1960లో సోవియట్ దేశానికి చెందిన సాబిన్ కనిపెట్టిన టీకాలమందును ఉపయోగించటం ప్రారంభమయిన తర్వాత యీ భయంకరవ్యాధి ఉధృతం బాగా తగ్గింది. అమెరికన్ మందుకంటే యిది సమర్థవంతంగా పని చేస్తుంది. 1961లో 23 బాలలకు యీ వ్యాధి సోకగా 1962లో ఎనమండుగురికి మాత్రమే సోకింది. ఈ మూడు సంవత్సరాల్లోనూ చనిపోయిన వారు ఒక్కరే. అధ్యక్షతన బావిలో బల్గేరియా బాలల పక్షవాత వ్యాధిపూర్తిగా నిర్మూలింపబడుతుంది.

బాలలకు పక్షవాత వ్యాధిరాకుండా చేయటానికి బల్గేరియాలో టీకాలు నిర్బంధంగా యివ్వబడుతాయి. పోయిన జనవరిలోనే 15 లక్షలమందికి సోవియట్ మందుతో టీకాలువేయబడ్డాయి

పోలియోవ్యాధి సోకినవారికి చికిత్స చేయటం విషయంలోకూడా చెప్పుకోదగిన విషయం సాధింపబడింది, బల్గేరియాలో తయారైన "నివాలిన్" అనే మందును ఉపయోగిస్తూ, కొన్నిరకాల వ్యాయామాలను చేయించటం ద్వారా మంచిఫలితాలు సాధింపబడుతున్నాయి.

సినీ పారిశ్రామిక సహకారసంఘ సమావేశం

హైదరాబాదు, మే 10(ఏ.ఎన్.ఎస్)

ఏర్పాటుచేయ సంకల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినీ పారిశ్రామిక సహకారసంఘ సర్వసభ్య సమావేశంమొన్న ఇక్కడ జరిగింది.

ఈ సమావేశానికి శ్రీ వై.వి. రమణ అధ్యక్షత వహించారు. శ్రీయుతులు ఎస్. పి. ఎ. ప్రకాశం, ఆర్. జానకిరామ్ యం. విద్యాసాగర్ ప్రసంగించారు.

పారిశ్రామిక సహకార సంఘాల నిబంధనలను అనుసరించడంపై సూచనచేస్తూ హైదరాబాద్ జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వ్రాసిన లేఖను శ్రీ ఆర్. జానకిరాం చదివారు.

సర్దుబాటు వైఖరిద్వారా నదీజలాల వివాద పరిష్కారం

డాక్టర్ కె. ఎల్. రావు అభిప్రాయం

(ఆంధ్రభూమి ప్రతినిధి)

విజయవాడ. మే 9

అవగాహన చేసుకోవాలని. సర్దుబాటుచేసుకోవాలని ఈ నాడు దేశంలో కనిపించే వాతావరణం నదుల అభివృద్ధి ప్రాజెక్టుల సందర్భంలో కూడా వర్తిస్తుందని విద్యుచ్ఛక్తి నీటిపారుదలశాఖ కేంద్రమంత్రి డాక్టర్ కె. యల్. రావు, ఆంధ్రభూమి ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్‌వ్యూలో చెప్పారు. టాంగ్‌ఫుట్ వద్ద దామోదర్ పైన డామ్‌నిర్మాణం సందర్భంలో కొన్ని సంవత్సరాలనుండి పశ్చిమ బెంగాల్, బీహార్ ప్రభుత్వాలకు అభిప్రాయ భేదాలు ఏర్పడి చివరికి పరస్పరాంగీకారభావం కుదిరినందుకు మానసిక పరివర్తనమే కారణమని మంత్రి అన్నారు.

పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల ముఖ్యమంత్రులుపైన పేర్కొన్న డాం నిర్మాణం విషయంలో ఏకాభిప్రాయానికి డాక్టర్ రావు హర్షం వెలిబుచ్చారు. నిజానికి ఈ వార్త, పెక్కు సంవత్సరాల నుండి సపరిష్కృతంగా నిలిచిపోయిన పెక్కు సమస్యలను సౌలభ్యంతో పరిష్కరించుకోవటానికి ఉత్తేజం కలిగించగలదని కేంద్రమంత్రి చెప్పారు. ఇదేవిధంగా వివిధ రాష్ట్రాలలో, నదుల అభివృద్ధి ప్రాజెక్టుల సందర్భంలో ఏర్పడిన వివాదాలలో కూడా సద్భావ పూరితమైన సామరస్యవిధానం ద్యోతకం కాగలదనే ఆశా భావం ఆయన వ్యక్తంచేశారు.

కృష్ణా గోదావరిజలాల సందర్భంలో కూడా సమాధానభావం ఏర్పడగలదని డాక్టర్ రావు సూచించారు.

నిన్నటి రోజు ఇక్కడికి వచ్చిన కేంద్ర మంత్రి డాక్టర్ కె.ఎల్. రావు విజయవాడ పట్టణాభివృద్ధి పథకం క్రింద యిక్కడ అమలుపరచుతున్న నీటి సరఫరా డ్రెయినేజి కార్యక్రమాలు పర్యవేక్షణ చేశారు,

నీటి సరఫరా పథకాన్ని అమలుపరచటంలో జరిగిన అభివృద్ధినిగురించి కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ నీటి సరఫరా విషయంలో ఈ సంవత్సరములోనే ప్రజలకు సమృద్ధిగా నీరు లభిస్తుందని చెప్పారు. 50 లక్షల గ్యాలనుల నీటి సరఫరా పథ[illegible] కొనసాగు[illegible] ప్లాంటును తెప్పించటానికి కొద్దిపాటిఆలస్యంజరగవచ్చునని ఆయన అన్నారు ఈ సంవత్సరాంతంలోపల ప్లాంటు తెప్పించటం పూర్తియౌతుంది.

దేవాలయనిధులతో నెలకొల్పే విద్యా సంస్థలలో మతాధ్యయనానికి ప్రాధాన్యం

డాక్టర్ సి. పి. రామస్వామి అయ్యర్ సూచన

తిరుపతి, మే 10

విద్యారంగంవంటి ఏకార్య విధానమైనా దేవాలయ నిధులతో ప్రారంభించబడినపుడు, అటువంటి విధానానికి ఆధ్యాత్మిక ప్రాతిపదికమూలాధారంగా వుండి, మతఅధ్యయనాభిలాషను ప్రోత్సహించి, దేశపు ప్రాచీన సంస్కృతిని పునరుజ్జీవింప చేయాలని డాక్టరు సి.పి. రామస్వామి అయ్యర్ ఇక్కడచెప్పారు

డాక్టరు అయ్యర్ నిన్న సాయంత్రం ఇక్కడ హిందూమత బోధనకై సంకల్పించినట్టి శ్రీ వెంకటేశ్వర వేదపాఠశాల 16వ వార్షిక తరగతులకు ప్రారంభోత్సవం జరిపారు.

అఖిలభారత హిందూ మతాదాయ కమిషను మాజీ చైర్మను డాక్టరు రామస్వామిఅయ్యర్ ఉపన్యసిస్తూ, కొన్ని దేవాలయాలు మతంతోగాని లేక ఆధ్యాత్మిక జీవితంతోగాని ఎటువంటి సంబంధంలేని కార్యక్రమాలకు తమ నిధులను విరాళాలుగా యిచ్చినట్టు, ధర్మాదాయ కమిషను జరిపిన సర్వేవల్ల వెల్లడి అయిందనిచెప్పారు.

మత కేంద్రంగా దేవాలయం చేయగల ప్రకృష్టసేవ పైన దానిఘనత ఆధారపడియుంటుంది. దానికి లభించే ఆదాయం పైనమాత్రం ఆధారపడదని ఆయన చెప్పారు.

హిందూమత అధ్యయనాన్ని ప్రోత్సహించటానికి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ విద్యార్థి వేతనాలు ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు.

మద్రాసు దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీమంత్రి శ్రీ కె. వెంకటస్వామి. విద్యార్థులకు మత గ్రంథాలు బహూకరించారు.

చక్కెర ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు సమస్యపైచర్చాగోష్ఠి

కొల్హాపూర్, మే 10

సహకార చక్కెర ఫ్యాక్టరీల ప్రధాన ఇంజనీర్ల రసాయన శాస్త్రజ్ఞుల ప్రథమ అఖిలభారత చర్చా గోష్ఠికి, మహారాష్ట్ర పరిశ్రమలు, ప్లానింగ్ శాఖ ఉపమంత్రి శ్రీ జి.డి. పాటిల్ నిన్నటి దినం ఇక్కడికి 20 మైళ్ళ దూరంలో ఉన్న ఇచ్చల్కరంజి వద్ద ప్రారంభోత్సవం జరిపారు.

శ్రీ పాటిల్ ఈ సందర్భంలో ఉపన్యసిస్తూ ప్రపంచ మార్కెటులో. భారత దేశం పోటీ చేయడానికి అనుగుణంగా చక్కెర ఉత్పత్తిచేసే పరిశ్రమలు, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని కోరారు.

పంచాంగ సహకార చక్కెర ఫ్యాక్టరీ ఈ చర్చాగోష్ఠిని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 60మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రముఖ అర్థశాస్త్రవేత శ్రీ ధనంజయగాడ్గిల్ ఈచర్చాగోష్ఠి అధ్యక్షత వహించారు.

కుటీర పరిశ్రమల ఎంపోరియమ్‌కు మంత్రి ప్రారంభోత్సవం

శ్రీకాకుళం, మే 10

రాష్ట్ర పరిశ్రమలమంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య, మొన్న ఉదయం జిల్లాపరిషత్తు ఇక్కడ ఏర్పాటుచేసిన కుటీర, చిన్న పరిశ్రమల ఎంపోరియంకు ప్రారంభోత్సవం జరిపారు. చిన్న పరిశ్రమ యెుక్కగాని లేక భారిపరిశ్రమయెుక్కగాని భావి అభివృద్ధి ఆ ప్రాంతప్రజలకు వీటిపట్లగల శ్రద్ధాసక్తుల పైన ఆధారపడి వుంటుందని మంత్రి ఉపన్యసిస్తూ చెప్పారు.

పంజాబ్‌లో చిన్న పరిశ్రమలు సక్రమంగా అభివృద్ధి చెందినాయి. అక్కడ ప్రతిగృహంలోను ఏదో యెుక పరిశ్రమ కొనసాగుతూంది. కాని బీహార్ రాష్ట్రంలో భారి పరిశ్రమలు అధిక సంఖ్యాకంగా ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో బీహారురాష్ట్రం యెుక్కసగటు ఆదాయం చాలా తక్కువగావుంది. పంజాబ్‌రాష్ట్ర సగటు ఆదాయం అక్కడ చిన్నపరిశ్రమలు స్థాపించబడినప్పటికీ అధికంగా నేవుంది. భారీపరిశ్రమలకంటె చిన్నపరిశ్రమలవల్ల నేవిశేషాదాయం లభిస్తుంది. నాణ్యమైన ఖాదీ ఉత్పత్తిలో శ్రీకాకుళం జిల్లా ప్రసిద్ధిగాంచింది పొందూరు సన్నఖద్దరు అఖిల భారత ఖ్యాతిపొందింది బొబ్బిలిలో తయారుచేసే వీణలు, ఈ జిల్లాలోని ఇతరకుటీర పరిశ్రమలు ప్రసిద్ధిపొందినాయి. అధ్యక్షునిభావిలో ఈ ఎంపోరియం క్రమాభివృద్ధిచెందగలదనే ఆశాభావాన్ని శ్రీలక్ష్మీనరసయ్య వ్యక్తంచేశారు.

హైవేస్ సిబ్బంది నిరాహారదీక్ష సంకల్పం వాయిదా

హైదరాబాద్, మే 10

హైదరాబాద్ డివిజన్ హైవేస్‌సిబ్బంది సంఘ కార్యవర్గం నిన్న ఇక్కడ సమావేశమై, నేడు ప్రారంభం కావలసిన నిరశనవ్రతం, 13వ తేదీ జరపదలచిన సమ్మెను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయించింది.

సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ కె. పెంటయ్య సమావేశానికిఅధ్యక్షతవహించారు.

ఉద్యోగులకోర్కెలవిషయమై ఉద్యోగుల ప్రతినిధులు, అధికారుల మధ్య రాజీ సంప్రతింపులు జరపాలని ప్రాంతీయ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జోక్యంకల్పించుకొన్నఫలితంగా నిరశనవ్రతం, సమ్మె సంకల్పాన్ని వాయిదా వేయడానికి నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

కరువుభత్యం హెచ్చింపు ఉత్తర్వులో లోపాల సవరణ ఆవశ్యకత

హైదరాబాద్, మే 10

"పూర్వపు హైదరాబాద్, వేతనముల స్కేళ్ళ ప్రకారం వేతనాలుపుచ్చుకునే రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి ఇటీవల రు. 5లు, రు 6 లు, కరువుభత్యమును హెచ్చించారు. అట్టి ఉద్యోగులకు మంజూరు చేసిన హెచ్చింపునుఅకౌంటెంటు జనరల్ తిరస్కరించారని", రాష్ట్ర ఉపాధ్యాయుల యూనియన్ జనరల్ కార్యదర్శి శ్రీతోట ఆనందరావు నిన్న ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

ఈ ప్రకటనలో ఇంకాయిలావుంది

"జీవితావసర వస్తువులధరలు విపరీతంగా పెరిగినందువల్ల ఆందోళనకుగురయైన ఉపాధ్యాయులు, ఈతిరస్కారంవల్ల ఆందోళిత పరిస్థితులలో జీవితంగడుపుతున్నారు. యూనియన్ ఈవిషయాన్ని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఈ సందర్భంలో అర్థమైన [illegible] జరుగగలదని ఆశిస్తున్నాము. [illegible] ఈలోపల ఉపాధ్యాయులు [illegible] ఓపిక పట్టియుండాలని [illegible] కోరుతున్నాము."

పబ్లిక్ నోటీసు

సికింద్రాబాదు మహాత్మాగాంధీ రోడ్డులో మునిసిపల్ పాత నెంబరు 62/1. కొత్త నెంబరు 2-2-140 మరియు 96 నెంబరులోని 1556-16 చదరపుగజాల విస్తీర్ణంకలిగిన యావత్తు ప్లాటు అందులో నిమడిగలు ఆఫీసుగదితో సహా కొనుగోలు చేయడానికై సికింద్రాబాదు మార్కెట్ వీధి నివాసులైన కీ॥శే॥ షులు రేవూరి నరసనింలు కుమారులు శ్రీయుతులు రేవూరి చంద్రమౌళి, రేవూరి చంద్రశేఖర్ లతో మా క్లయింట్లు విక్రయ ఒప్పందం ఏర్పరచుకొని, ధరావతు సొమ్ముకూడా చెల్లించారని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇతరులు ఎవరైనా, పైన పేర్కొన్న ఆస్తి తమకు చెందినదని కాని లేదా ఆ ఆస్తిపై తమకు హక్కుకలదని భావించే వారు 1964వ సంవత్సరం మే 15నవ తేదీలోగా ఆవిషయాన్ని క్రింది సంతకం దారులకు తెలియపరచాలి. లేనిపక్షంలో మా క్లయింట్లు ఆస్తిని కొనుగోలుచేసి, విక్రయపత్రాన్ని రిజిష్టర్ చేసుకుంటారు. ఆక్షేపణలను, అభ్యంతరాలను త్రోసిపుచ్చినట్టు పరిగణించడం జరుగుతుంది.

డి. హనుమంతరావు, బి. ఏ., ఎల్. ఎల్. బి.,
వి. వి. యల్. నరసింహరావు, బి. ఎ బి. ఎల్.,
ఎ. శేషాచలం మొదలియార్, బి. ఎ., ఎల్. ఎల్. బి.,
పి. బాలగోపాల్, బి. ఎ., ఎల్. ఎల్. బి.,
అడ్వొకేట్లు,
సికింద్రాబాదు.

59 వ.........వారం!

సుభాష్
ముషీరాబాద్
11, 2, 6, 9-45

లవకుశ

అశోక్: హైదరాబాద్
ప్యారడైజ్: సికిందరాబాద్

విక్రమ్‌ప్రొడక్షన్స్
అమరశిల్పి జక్కన్న
నిర్మాత-దర్శకుడు బి.యస్.రంగా
ఈస్ట్‌మన్‌కలర్
రోజు 3 ఆటలు: 2-30, 6-15, 9-30

30వ వారం!

వరద గోదావరిలా విహరించిన గోపన్న-
బాబూమూవీస్
మూగమనసులు
బసంత్: హైదరాబాద్
ఇంజాలి: సికింద్రాబాద్
3 ఆటలు: 2-30, 6-15, 9-30

సాగర్: హైదరాబాద్
రాజేశ్వర్: సికింద్రాబాద్

శ్రీ మైరావణ
నిర్మాత-దర్శకుడు. బి.ఎ.సుబ్బారావు
సంగీతం. యస్.రాజేశ్వరరావు
రోజు 3 ఆటలు: 2-45, 6-15, 9-30



వాణిజ్యభూమి

సూనెగింజల మార్కెట్

బొంబాయి, మే 9

నేడు బొంబాయి సూనెగింజల మార్కెట్‌లో వ్యాపారం మందకొడిగా సాగింది. వ్యాపారం ముగిసే సమయానికి విలువలలో స్వల్పమైన మార్పులు మాత్రం కనువించాయి.

ఆముదాలలో 5000క్యాండీలవ్యాపారం జరిగినది. వేరుశనగ విత్తులవ్యాపారం నిలకడగా ఉంది.

ఆముదాలు (జూన్) ప్రారంభం 174-62; మధ్యలో ధరలు 174-25 వరకు పడిపోయినప్పటికి తరువాతమళ్ళీ పుంజుకున్నాయి ముగింపు 174-62.

వేరుసెనగ (జూలై) ప్రారంభం 240-12; ముగింపు 140-12.

వేరుసెనగ తెలకపిండి (జూలై) ముగింపు 58-00.

అవిసెలు (జూన్) ముగింపు 42-75 ప్రత్తిగింజలు (జూలై) ముగింపు 105-50;

హైదరాబాద్ మే 9

వాయిదాధరలు:- వేరుసెనగనూనె (జూన్-ఆగష్టు) వ్యాపారం లేదు.

వేరుసెనగ తెలకపిండి వ్యాపారం లేదు.

రెడీ ధరలు:- ఆముదాలు 67-00; ఆముదం 18-62; వేరుసెనగ 93-00; వేరుసెనగనూనె 21-50; వేరుసెనగ తెలకపిండి 31-00.

నగర మార్కెట్

కొత్తూరి సీతయ్య పేట

ఫోన్ : 41255

100 కిలో గ్రాముల తూకం

శనివారం 9-5-64

తెల్ల జొన్నలు	52-00	56-00
చట్టి జొన్నలు	45-00	47-00
పచ్చ జొన్నలు	43-00	44-50
పసుపు	138-00	140-00
పెద్ద కందులు	82-00	85-00
ఎర్ర కందులు	75-00	81-00
పెసలు	77-00	82-50
మినుములు	67-00	71-00
సెనగలు	64-50	35-00
ఉలవలు	37-00	38-00
బెల్లం	56-00	57-00
మిర్చి	108-00	204-00
కొత్త చింతపండు	68-00	68-00
ఉల్లిగడ్డ	10-00	16-00
బం గోధుమలు	80-00	88-00
[illegible] గోధుమలు		
మా గోధుమలు	74-00	75-00
కుసుములు	65-00	67-00
నువ్వులు	130-00	140-00
యిలాచీపలుకు	84-00	94-00
పెద్దయిలాచీ	120-00	122-00
ఆముదాలు	62-00	65-50
ప్రత్తిగింజలు	38-00	42-00
నూనె	21-50	—
పెద్ద కందిపప్పు	108-00	110-00
చిన్న కందిపప్పు	104-00	106-00
మినప పప్పు	93-00	94-00
ఇలాచీకాయ	73-00	—
పెసర పప్పు	110-00	112-00
సెనగ పప్పు	74-00	78-00
పిండి సెనగ పప్పు	89-00	90-00
లంక పప్పు	73-00	74-00
ధనియాలు	165-00	175-00

బొంబాయి మార్కెట్

శనివారం మే 9

బులియన్ వెండి రేటు	259-50
పుదీన	86-00
పాదరసం	21-50
కర్పూరం	29-00
లవంగాలు	295-00
రాగితుక్కు	675-00
సీసం	280-00
తగరం	290-00
తుత్తునాగం	300-00

నూనెగింజలు రెడీ

వేరుసెనగ పెద్దవి	55-00
నిజాం	56-25
కోరమాండల్ రెడి	58-00
అవిసె పెద్దవి	44-37
చిన్నవి	43-00
ఆముదాలు (మద్రాసు)	34-25
,, పెద్దవి	33-00
వేరుసెనగనూనె రెడి	21-55
అవిసె నూనె	18-50
ఆముదం మొదటిరకం	16-00
రెండవ రకం	13-65
కొబ్బరినూనె	27-62
మిరియాలు	178-00

చిలీ విదేశాంగ మంత్రితో దేశాయి చర్చలు

శాంటియాగో, [illegible]ల్, మే 9

భారత విదేశాంగ వ్యవహారాలశాఖ సెక్రటరి జనరల్ శ్రీ ఎం. జె. దేశాయి ఇక్కడ నిన్న రాత్రి చిలీ విదేశాంగ మంత్రి శ్రీ జియో ఫిలిప్స్‌తో సంభాషణలు జరిపారు.

అంతర్జాతీయ పరిస్థితి తూర్పు దేశాల సమస్యలు, జనీవాలో జరిగిన ప్రపంచ వాణిజ్య మహాసభ పరిణామాలు, మొదలైన విషయాలను గురించివారు చర్చించారు.

రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమల స్థాపనకు మైనింగ్ కార్పొరేషన్ యోచన

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాదు, మే 9

రాష్ట్రంలో ఖనిజ సంపద ఆధారంగా అనేక పరిశ్రమలను త్వరలోనే నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ మైనింగు కార్పొరేషన్ ఉద్దేశిస్తున్నదని తెలుస్తున్నది.

కార్పొరేషన్ ఇంతవరకు ఖనిజాలను ముఖ్యంగా ముడి ఇనుమును త్రవ్వి వెలికి తీయడం వానిని ఎగుమతి చేయడం వంటి పనులనే చేస్తూవచ్చింది. ఇప్పుడు వివిధ పరిశ్రమలను నెలకొల్పడానికి పూనుకొన్నది. ఇందులో అనేక పరిశ్రమలను ప్రైవేటు కంపెనీలతో కలసి నెలకొల్పుతున్నారు.

ఖమ్మంజిల్లా బోనకల్లులో కార్పొరేషన్ ఒక సిమెంటు ఫ్యాక్టరీని నెలకొల్పనున్నది. ఈ ఫ్యాక్టరీ రోజుకు 600 టన్నుల సిమెంటును ఉత్పత్తి చేస్తుంది.

విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో చీనామట్టిని శుద్ధి చేసే కర్మాగారాన్ని ఏర్పాటుచేయాలని చూస్తున్నారు. ఈ ప్రాజెక్టులో రోజుకు 30 టన్నుల తెల్ల చీనా మట్టిని వెలికితీసి శుద్ధిచేస్తారు. ఇలా రోజుకు 10 టన్నుల శుద్ధిచేసిన మట్టి ఉత్పత్తి అవుతుంది.

ఈ తెల్లమట్టి విశాఖపట్నం జిల్లా గుర్రాజుపేట, లక్ష్మీపురం గ్రామాలలో లభిస్తుంది. ఉభయ గోదావరిజిల్లాలలో కొన్ని ప్రాంతాలలోకూడా ఈ మట్టి లభ్యమవుతుంది. ఈ ప్రాంతంలో 2 లక్షల 60 వేల టన్నుల చీనామట్టి నిల్వలున్నట్లు అంచనా వేశారు.

హైదరాబాద్ దగ్గర ఒక ప్రవేట్ [illegible] చలవరాయిని [illegible] పగిషీ చేసే ఫ్యాక్టరీని నెలకొల్పాలని కార్పొరేషన్ నిర్ణయించింది. అందుకు కావలసినంత చలవరాయి ఖమ్మం జిల్లాలో లభ్యమవుతుంది.

గూడూరు మైకాగనులలో లభించే వృధాగా పారవేసే మైకాను ఉపయోగించి 12 లక్షల మైకా ఇన్సులేటింగు ఇటికలను తయారుచేసే ఫ్యాక్టరీని నెలకొల్పాలని కూడా చూస్తున్నారు.

మేలిరకం సున్నపురాయి నుండి రసాయన పదార్థాలను ఉత్పత్తిచేసే ప్రాజెక్టు నొకదానిని నెలకొల్పాలని ఉద్దేశిస్తున్నారు.

అనేక ప్రాంతాలలో చీనామట్టి, మేలిరకం సున్నపురాయి చలవరాయి నిల్వలు గురించి పరిశోధనచేసి నిల్వలను అంచనా వేశారు. ఆస్బెస్టాజ్-వంటి ఇతర ఖనిజాల నిల్వలు గురించి ఇంకా పరిశోధనా సాగిస్తున్నారు.

ముడిఇనుము, గుండుమట్టి సున్నపురాయి, బెరైట్స్‌లను త్రవ్వి వెలికి తీయడాన్ని కార్పొరేషన్ అప్పుడే ప్రారంభించింది. ముడిఇనుమును ఖనిజలోహపదార్థాల వాణిజ్య సంస్థ ద్వారా ఎగుమతి చేస్తున్నారు ఇప్పటివరకు 3 లక్షల టన్నుల ముడి ఇనుమును వెలికితీశారు. 2 లక్షల టన్నుల సరుకును ఎగుమతి చేశారు

లలిత కళా కేంద్రాలకు ప్రభుత్వ సహాయం

మచిలీపట్నం పౌరసన్మానసభలో ముఖ్యమంత్రి వివరణ

మచిలీపట్నం, మే 9

మానవ జీవితపు మనుగడకు ఆహారం ఒక్కటే ప్రధానం కాదు గనుక ఆర్థికాభివృద్ధితోపాటు లలితకళలుకూడా అభివృద్ధి చెందాలని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి ఇక్కడ చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించటం వల్లనే సమాజం సర్వతోముఖాభివృద్ధి పొందుతుంది.

స్థానిక పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ సన్నాల వేణుగోపాలరావు ముఖ్యమంత్రికి సమర్పించిన పౌర సన్మాన పత్రానికి శ్రీ బ్రహ్మానందరెడ్డి సమాధానం చెపుతూ పురపాలక సంఘాలు తమ పట్నాలలో లలిత కళా కేంద్రాలు స్థాపిస్తే ప్రభుత్వం సహాయం చేస్తుందని చెప్పారు.

నాలుగవ ప్రణాళిక కాలంలో ఇతర పట్నాలతోపాటు, మచిలీపట్నంలో కూడా మంచి నీటి సరఫరా పథకం అమలు పరచబడుతుందని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారు.

ఆంధ్రజనత ట్రస్ట్ ప్రెస్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

హైదరాబాదు, మే 9

ఆంధ్రజనత ప్రెస్ ట్రస్టు ఉద్యోగుల సంఘ వార్షిక సర్వసభ్య సమావేశం నారాయణగూడలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో యీ నెల 1వ తేదీన జరిగింది. శ్రీ ఎస్. కిషన్ అధ్యక్షత వహించారు. 1964-65 సంవత్సరానికి యీ క్రింది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు:

శాసనసభ్యులు శ్రీజి. సంజీవరెడ్డి అధ్యక్షులు, శ్రీఎస్.కిషన్ ఉపాధ్యక్షులు. శ్రీ కె. సీతారామసింగ్ ప్రధాన కార్యదర్శి, శ్రీ ఎన్. ప్రకాశ్ సంయుక్త కార్యదర్శి. శ్రీపి. రామచందర్ కోశాధికారి: శ్రీయుతులు పి. శంకర్, ఎన్.సీతారాం, కె. హనుమంతరావు, ఆర్. నరసింహన్, కె. అంజయ్య, ఎ. రాజయ్య, షేక్ మొహియుద్దీన్ వర్కింగ్ కమిటీసభ్యులు.

ఫార్వర్డ్ బ్లాకు ఆర్. ఎస్. పి. లకు రాజ్ నారాయణ్ సింగ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 9 (పి. టి. ఐ)

సోషలిస్టు, ప్రజాసోషలిస్టు పార్టీల విలీకరణను సాధించేందుకు ఏర్పాటు చేసే జాతీయ అడ్‌హక్ కమిటీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ తదితర సోషలిస్టుల ఏకీకరణలో విశ్వాసమున్న పార్టీలను సోషలిస్టు నాయకుడు శ్రీ రాజ్‌నారాయన్ అభ్యర్థించారు.

ఆస్పత్రి గదిలో నుండి శిశువు అదృశ్యం

గుంటూరు, మే 9

గుంటూరు ఆస్పత్రిలోని ఎయిర్ కండిషన్ గదిలో ఉంచిన ఒక పసిబిడ్డ మంగళవారం నాడు మాయమైనది.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. కోదండరామయ్య ఈ విషయాన్ని తెలుపుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు చర్యలు తీసుకొంటున్నారని అన్నారు.

మెదక్‌లో ఏడుగురు కమ్యూనిసుల సస్పెన్షన్

హైదరాబాద్, మే 9

మెదక్ జిల్లా కమ్యూనిస్టు కౌన్సిల్ కుక్నూర్ పల్లిలో సమావేశమైలిచ్చిన్నకర చర్యలు సాగిస్తున్నందుకు ఏడుగురు సభ్యులను సస్పెండ్ చేసినది. వారి పేర్లు: బి. కిష్టయ్య, ఆగమయ్య, నరసింహారావు నరసింలు, రామకిషన్, ఊశయ్య, సున్నం నరసింలు, పుండరీకాక్షం అనే మరో సభ్యుని ఇదివరకే సస్పెండ్ చేశారు.

నూలువస్త్రాల ఎగుమతులపై అమెరికాతో ఒప్పందం

వాషింగ్‌టన్, మే 9

ఇండియా, అమెరికాల మధ్య నూలు వస్త్రాల వ్యాపారానికి సంబంధించి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్టునిన్న యిక్కడ ప్రకటించారు. ఈ ఒప్పందం 1964 ఏప్రిల్ నెలనుండి రెండున్నర సంవత్సరాల వరకు అమలులో ఉంటుంది.

ప్రపంచ దేశాల మధ్య నూలు వస్త్రాల వ్యాపారానికి సంబంధించిన దీర్ఘకాలిక ఏర్పాట్ల గురించి 1962 ఫిబ్రవరిలో జరిగిన జెనీవా ఒడంబడిక నాల్గవ ఆర్టికల్ ననుసరించి ఈ ఒప్పందం కుదుర్చుకొన్నారు.

ఇండియా నుండి అమెరికాకు నూలు వస్త్రాల ఎగుమతులను క్రమ బద్ధంగా అభివృద్ధి పరచడం ఈ ఒప్పందం లక్ష్యం

ప్రింటెడ్ క్లాత్, ట్వల్లు, సాటిన్, తువ్వాళ్ళు, మొదలైన రకాలకు చెందిన వస్త్రాల ఎగుమతులపై పరిమితి విధించడానికి ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తున్నది.

మొదటి 6 మాసాల కాలంలో ఐదు ప్రధాన రకాలకు చెందిన వస్త్రాల ఎగుమతులు 185 లక్షల చదరపు గజాలకు మించరాదని పరిమితి పెట్టారు.

సాలీనా 370 లక్షల చదరపుగజాల బట్టను అమెరికాకు ఎగుమతి చేయడానికి అంగీకరించారు.

ఈ ఒప్పందం సరిగా అమలు జరగడానికి అవసరమైన గణాంక వివరాలను పరస్పరం తెలియచేయడానికి ఉభయ ప్రభుత్వాలు అంగీకరించాయి.

అస్ఫాల్ట్ రోడ్లపై ఎస్టా గోష్ఠిలో గురుమూర్తి ప్రసంగం

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, మే 9

రాష్ట్రంలో రోడ్ల దుస్థితి నరికట్టవలసిన అవసరమెంతైనా ఉన్నదని కార్మిక, రవాణాశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి నేడిక్కడ అన్నారు.

ఎస్సోస్టాండర్డ్ ఈస్టర్న్ సంస్థవారు అస్ఫాల్ట్‌పూతపై జరిపిన చర్చాగోష్ఠిని ప్రారంభిస్తూ శ్రీ గురుమూర్తి పైవిధంగా అన్నారు. "ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్" భవనంలో జరిగిన ఈ గోష్ఠికి రాష్ట్ర ప్రభుత్వ హైవేస్ చీఫ్ ఇంజనీరు శ్రీ హెచ్. ఆర్ సామోజీరావు అధ్యక్షత వహించారు.

లంచం తీసుకొన్న నేరంపై పోలీసు ఉద్యోగుల సస్పెన్షన్

వరంగల్, మే 9 (పి టి ఐ)

వరంగల్ జిల్లా ములుగు తాలూకా ఘనపురం పోలీసు స్టేషన్‌కు చెందిన ఒక సబ్ ఇన్‌స్పెక్టరు ఒక హెడ్ కానిస్టేబుల్ ఒక కానిస్టేబులును లంచం తీసుకొన్నందుకు సస్పెండ్ చేశారని నేడిక్కడ అధికారికంగా తెలిసిందని ఈ పోలీసు ఉద్యోగులు ఒక లారీ డ్రైవరు నుండి 150 రూపాయలు పుచ్చుకొంటూ వుండగాఅరెస్టయ్యారు.

చిన్న, మధ్య తరహా పత్రికల ఇబ్బందులు

ప్రభుత్వ సహాయానికై విజ్ఞప్తి: పరిశీలనకు ముఖ్యమంత్రి హామీ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాదు, మే 9

రాష్ట్ర పత్రికా సలహా సంఘం ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఇతర మంత్రులు కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుడు శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రభృతులను సత్కరించే నిమిత్తం నేడు సికింద్రాబాద్ క్లబ్‌లో ఒక విందు ఏర్పాటు చేసింది.

పత్రికా సలహాసంఘం కన్వీనర్, 'దక్కన్ క్రానికల్' మేనేజింగుఎడిటర్ అయిన శ్రీ కె. ఆర్. పట్టాభిరాం అతిధులకు స్వాగతంచెప్తూ ఆర్థికచిక్కులవలన, ప్రభుత్వప్రోత్సాహం లభించకపోవడం వలన చిన్న పత్రికలు మధ్యతరగతి పత్రికలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు, న్యూస్‌ప్రింటు కాగితం, ముద్రణాయంత్రాలు సమకూర్చుకోవడంలో చాలఇబ్బందినిఎదుర్కోవలసి వస్తున్నట్లు వెల్లడించారు రాష్ట్రంలోని పత్రికలకు ప్రభుత్వం తగినన్ని ప్రకటనలు యివ్వాలనికూడా శ్రీపట్టాభిరాం కోరారు.

పత్రికలు, ప్రభుత్వం మధ్య శ్రీ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వుండినప్పుడు నెలకొన్న సత్సంబంధాలు శ్రీ బ్రహ్మానందరెడ్డి సమర్థవంతమైన పరిపాలనా కాలంలో కూడా కొనసాగగలవనీ రాష్ట్ర పురోభివృద్ధి కూడా అదేవిధంగా సాగగలదనీ ఆయన ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

చిన్న పత్రికలకూ మధ్య తరగతి పత్రికలకూ ప్రభుత్వం వీలయిన సహాయమంతా చేస్తుందని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు.

శ్రీ అబిద్ అలీఖాన్ వందన సమర్పణచేస్తూ, న్యూస్‌ప్రింట్ సరఫరాలో పత్రికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఇటీవలఏర్పాటయిన ప్రెస్‌క్లబ్ వంగతి ప్రస్తావించి, క్లబ్బుకు నగరమధ్యంలో స్థలంకావలసివుందనీ, ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ మాదిరిఈక్లబ్బును అభివృద్ధిచేయదలచామనీ వివరించారు.

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ శ్రీ నరేంద్ర లూథర్, స్థానిక పత్రికల సంపాదకులు ఇతర ప్రముఖ పత్రికా రచయితలు విందుకు హాజరయ్యారు.

ఆర్.టి.సి. బస్సు క్రింద పడి స్త్రీ మరణం

కామారెడ్డి, మే 9

నిన్న తాడువాయి గ్రామంవద్ద ఒక స్త్రీ కామారెడ్డి నుండి నిజాంసాగర్‌కు వెళ్ళే బస్సు కింద పడి మరణించింది. మృతురాలు అయినాపురం గ్రామస్థురాలని తెలుస్తున్నది. ఆమె నిన్న మధ్యాహ్నం 2 1/2 గంటలకు బస్సుకింద పడగా 3 గంటలకు మరణించింది. స్వ.వి.

నిజామాబాద్ లయన్స్ క్లబ్ సహాయార్థం రాగిణి నృత్యప్రదర్శనం

నిజామాబాద్, మే 9

స్థానిక లైన్స్‌క్లబ్ సహాయార్థం యీనెల 7వ తేదీన, ప్రఖ్యాత సినీనటి శ్రీమతి రాగిణి బృందంవారు నృత్యప్రదర్శనాన్ని యిచ్చారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గులాంనబి రాగిణి బృందానికి స్వాగతం చెప్పారు. శ్రీ ఎస్. వి. గోపాలరావు వందనసమర్పణతో నాటినృత్య ప్రదర్శన కార్యక్రమం పూర్తయింది.

ఉద్యోగుల ప్రభుత్వ భీమా పథకం చిత్తూరుకు వర్తింపు

న్యూఢిల్లీ, మే 9

ఉద్యోగుల ప్రభుత్వ భీమాపథకాన్ని రాష్ట్రంలోని చిత్తూరు ప్రాంతానికి వర్తింపజేశారు.

ఈ పథకంద్వారా 700 మంది ఫ్యాక్టరీ కార్మికులకు లాభం చేకూరుతుంది.

నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ల సంజాయిషీ

నిజామాబాద్, మే 9

నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం యీ నెల 6వ తేదీన జరిగింది. మున్సిపల్ కౌన్సిల్‌ను రద్దుచేయవద్దని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ 34 మంది సభ్యులలోను, 21 మంది సభ్యులు విజ్ఞాపన పత్రంపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది మున్సిపాలిటీని రద్దుచేసి, జిల్లా కలెక్టరునే స్పెషల్ ఆఫీసరుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు వార్తలు వ్యాప్తిలో ఉన్నాయి.

రేడియో టెలిఫోన్లు

సోఫియా, మే 9

ఈనగరంలోనిఒక యంత్రాగారం బల్గేరియన్ రేడియో టెలిఫోన్లను ఉత్పత్తిచేయటం ప్రారంభించింది.

ఈ రేడియో టెలిఫోన్లు 40 మొదలుకొని50 కిలోమీటర్లవరకూ పనిచేస్తాయి. సహకార వ్యవసాయ క్షేత్రాలలో దూరపు ప్రాంతాలలో పనిచేసే దళాలకూ క్షేత్రఅధికారవర్గానికీ, యంత్రాగారాలకూ, వాటిశాఖలకూ,వివిధ వైద్యదళాలకూమధ్యసంబంధాలను కల్పించటానికి యీ రేడియో టెలిఫోన్లు ఉపయోగపడుతున్నాయి.

దక్షిణవియత్నామ్ మాజీ అధ్యక్షుని సోదరునికి మరణశిక్ష

సైగాన్, మే 9

దక్షిణవియత్నాం మాజీఅధ్యక్షుడు అంగ్ దిన్ డెమ్ తమ్ముడు అంగ్ దిన్ కాన్‌కు విధించిన మరణ దండనను నేడు సైగాన్‌లో అమలు జరిపారు.

గతనెలలో కాన్ కు విప్లవకోర్టు మరణదండనను విధించినది.

మూగమనసులు శతదినోత్సవాలు

హైదరాబాద్, మే 9

బాబుమూవీస్‌వారు నిర్మాణంచేసిన "మూగమనసులు" చిత్రం కమలేశ్వర టాకీస్ (అమలాపురం)లో ఈనెల 12న బసంత్‌టాకీస్ (హైదరాబాద్)లో 14న మరి 19 కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకుంటూంది. ఈ చిత్రంలోపాల్గొనిన ప్రముఖ నటీనటులు శతదినోత్సవాలన్నిటికి హాజరౌతారు.

మార్వాడీ హోల్డింగ్ ఫ్యాక్టరీ

కాసర్ హట్ట హైదరాబాద్-2

తంతి: "UTENSIL" ఫోన్: 41556.

నాణ్యమైన ఇత్తడి, రాగి, సీసం షీట్లను పారిశ్రామికావసరాలకు. ఆర్. సి. సి జాయింట్లకు అన్ని సైజులలో రాగి షీట్లు, అన్ని సైజులలో అల్యూమినియం ఫ్లోరింగ్ స్ట్రిప్పులు తయారు చేయువారు

వివరాలు కావాలంటే అడగవచ్చును.

పనికిరాని "పరిన్స్" అమ్మకం

పనికిరాని మెత్తని ఉక్కు షీట్ మెటల్ పర్లిన్స్ అమ్మకానికి గలవు, వీటిని చూచుకోదలచినవారు చీఫ్ స్టోర్ కీపర్, ప్రాగాటూల్స్ లిమిటెడ్, కవాడిగూడారోడ్, సికిందరాబాద్-3 చిరునామాలో మామూలు పని రోజులలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య శనివారాలలో మధ్యాహ్నం 1-00లోపు రావచ్చును.

టెండర్లమీద "పర్లిన్స్" అని వ్రాసి సీలువేసిన కవరులో వుంచి దిగువ సంతకం చేసిన వారికి మే 14 తేదీన మధ్యాహ్నం 3 గంటలలోగా పంపాలి. రేటును లాటంతటికి "ఉన్నది ఉన్నట్లుగా" పద్ధతిని ఇవ్వాలి. ధరావతుగా టెండరుతో బాటు రు. 200/- బ్యాంకు డ్రాఫ్టు ద్వారాగాని లేక రొక్కంగాని చెల్లించాలి టెండరు స్వీకరించినప్పటినుంచి 48 గంటలలోగా "పర్లిన్స్‌ను" తీసుకు పోవాలి.

పర్చేజ్ ఆఫీసర్
ది ప్రాగాటూల్స్ లిమిటెడ్,
కవాడిగూడారోడ్, సికిందరాబాద్-3

చెట్ల సప్లయి

పేప. మే-ఫ్లవర్. రెయిన్‌ట్రీ లేక అటువంటి రకానికిచెందిన 100 చెట్లను మేము కొనదలిచాము. చెట్లు 5 6 సంవత్సరాలవైవుండాలి. పైభాగం 12 అంగుళాలకు తక్కువ వుండరాదు. ఇవి మా కవాడిగూడా టికట్‌పల్లిలో వున్న మా ఫ్యాక్టరిలో నాటబడుతాయి.

మొత్తం అంతటికీగాని, లేక కొంత భాగానికైనా గాని సీలువేసిన టెండర్లను టెండరుమీద "ట్రీస్" అని వ్రాసి 1964 మే 22 వ తేదీన మధ్యాహ్నం 3 గంటలలోగా పర్చేజ్ ఆఫీసర్, ది ప్రాగాటూల్స్ లిమిటెడ్, కవాడిగూడా రోడ్, సికిందరాబాద్ - 3 చిరునామాకు పంపవలెను.

మెట్రిక్ తూనికలు, కొలతలు మాత్రమే చట్టసమ్మతమైనవి-వీశలు, శేర్లలో క్రయ విక్రయాలు జరుపవద్దు.

కిలో గ్రాములలో మాత్రమే కొనండి

DA 63/440

నేటిరాత్రి 7 గంటలకు

దారాసింగ్
(రుస్తుం-ఎ-హింద్)

తో

సన్ ఆఫ్ కాంగ్
(కింగ్ కాంగ్ మేనల్లుడు)

మరియు:

రౌండ్లు, ఇంటర్వెల్స్ లేకుండా గంటసేపు నిర్విరామ మల్లయుద్ధం



బిల్ రాబిన్‌సన్ కు రన్‌ధావా
(అత్యున్నత శ్రేణికిచెందిన శాస్త్రీయపద్ధతి మల్లయోధుడు) (షేర్-ఎ-హింద్)

ఫ్రీ స్టైల్ కుస్తీ

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, హైదరాబాద్

ఇంకా ఇతర పోటీలు

సౌదాగర్‌సింగ్ తో స్పేస్‌మన్
(డ్రాప్-కిక్-మాస్టర్) (ముసుగుమనిషి)

సుచాబాయ్ తో దర్బారా

ప్రవేశ రుసుం: రు. 10-00 5-00, 2-50 1-25

కాంప్లిమెంటరీ ప్యాసులు పనిచేయవు. స్త్రీలకు ప్రత్యేకస్థలం

శనివారం ఉదయం 9 గంటలనుండి రాత్రి 7 గంటలవరకు ఎగ్జిబిషన్ మైదానంలో అడ్వాన్సు బుకింగ్. కార్యక్రమంలో మార్పులు జరగవచ్చు.

నేషనల్ ఎంటర్‌ప్రైజర్స్ సిండికేట్

(Saba)

నాందేడ్ వద్ద గూడ్స్ రైలుకు ప్రమాదం

11 వ్యాగన్లు పట్టాలు తప్పగా సరాసరి రాకపోకలకు ఆటంకం

హైదరాబాదు, మే 9

సెంట్రల్ రైల్వేలో నిజామాబాద్ పూర్ణా మీటర్ గేజి సెక్షన్‌లో ముదేడ్ నాందేడ్ స్టేషనుల మధ్య ఆదివారం సాయంకాలం ఒక గూడ్సు రైలుకు చెందిన 11 వ్యాగన్లు పట్టాలు తప్పినవి.

ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. అయితే రైళ్ళ సరాసరి రాకపోకలకు మాత్రం ఆటంకం ఏర్పడినది. రెండువైపులా రైళ్లు ప్రమాదస్థలం వరకు వెడుతున్నాయి. ప్రయాణీకులు రైళ్లు మార్చి చేర్పాట్లు చేశారు.

136 ఇళ్ళు దగ్ధం

కాకినాడ, మే 9 (పి.టి.ఐ)

తూర్పుగోదావరి జిల్లాలోని చొల్లంగి గ్రామంలో సంభవించిన ఒక అగ్నిప్రమాదంలో 136 ఇళ్లు నిల్వచేసిన ఒక గడ్డి దగ్ధమయిపోయాయి.

పండితులు పామరులు మెచ్చుకుంటున్న చిత్రం తప్పక చూడండి!

గీతాంజలి పిక్చర్స్ వారి కోహరా వయోజనులకు మాత్రమే.



నటీనటులు:- వహీదా రెహమాన్, బిశ్వజిత్, లలితాపవార్

నిర్మాత సంగీతం: హేమంత్ కుమార్

దర్శకత్వం: బిరేన్ నాగ్

లిబర్టీ హైదరాబాద్ | ప్రకాష్ హైదరాబాద్ | మినర్వా సికిందరాబాద్

నేడు 4 ఆటలు: 12-30 3-30, 6-30, 9-30

ఆటల సమయాలలో అడ్వాన్సు బుకింగు గలదు

మోహన్ ఔరంగాబాద్ | మెజిస్టిక్ జాల్నా | పిక్చర్ పాలెస్ నిజామాబాద్

—రషీద్ మెహతా అండ్ కో రిలీజ్—

కైరోలో కృశ్చేవ్‌కు అపూర్వ స్వాగతం

కైరో, మే 9 (పి.టి.ఐ)

కైరోలో నేడు రష్యా ప్రధాని కృశ్చేవ్‌కు కైరో చరిత్రలో ఏ విదేశ ప్రముఖునికీ లభించని బ్రహ్మాండమైన స్వాగతం లభించింది! రమారమి 10 లక్షల మంది ప్రజలు శ్రీ కృశ్చేవ్‌కు స్వాగతమివ్వడానికి వచ్చారని అంచనా వేశారు. జనంలో దాదాపు తొక్కిడి ఏర్పడినంత పని జరిగింది.

జనం కృశ్చేవ్‌ను చుట్టుముట్టకుండా నిరోధించేందుకు రక్షక బలాలు గుంపులను వెనక్కి నెట్టవలసి వచ్చింది. 1955 లో శ్రీ కృశ్చేవ్ లక్నోకు వచ్చినప్పటి పరిస్థితి పునరావృత్తమైంది.

శ్రీ కృశ్చేవ్ అధ్యక్షుడు నాసర్‌తో కలిసి స్పెషల్ రైలులో ప్రత్యేకంగా శోభాయమానంగా అలంకరించిన రామ్‌సేస్ రైల్వే స్టేషన్‌లో దిగగానే జనం బిగ్గరగా ఈలలువేసి హర్షధ్వానాలు చేశారు. వారు ఈ స్పెషల్ రైలులో మూడున్నర గంటలు ప్రయాణంచేశారు. మార్గమధ్యంలో 8 చోట్ల ఆగి స్వాగతవచనాలు స్వీకరించారు.

వేలకొలది జన వీధులలో బారులుతీరి పోయి నిలుచున్నారు. భవనాలపై విద్యుత్ స్తంభాలపై చేరి శ్రీ కృశ్చేవ్‌కు కైరో చరిత్రలో ఎన్నడూ ఎవరికీ ఇవ్వని ఉత్సాహపూరితమైన స్వాగతం యిచ్చారు.

'హైదరాబాద్‌లో' కథల సంపుటి అంకితం

హైదరాబాద్, మే 8

"హైదరాబాదులో" అనే కథల సంపుటిని నవ్యసాహితీ సమితి ఆధ్వర్యంలో రచయిత శ్రీ పోతుకూచి సాంబశివరావు, పావన్నపేట రాజా శ్రీ ఎ రామచంద్రారెడ్డికి ఈ నెల 8వ తేదీన అంకితం యిచ్చారు. ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు పరిశ్రమల శాఖామంత్రి డాక్టర్ ఎమ్. ఎన్. లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహించారు.

వాస్తవిక దృక్పథంలో వ్రాయబడిన కథలు జనాదరణను పొందుతాయని మంత్రి అన్నారు. శ్రీ సాంబశివరావు మాట్లాడుతూ హైదరాబాదు ఆంధ్ర రాజధానీ నగరం అయిన తర్వాత ఇక్కడి దృశ్యాలన్నీ నవ్య వాతావరణంలో కథలు అల్లవలసిన అగత్యం కలదన్నారు. పూర్వకాలంలో రాజులు, సంస్థానాధీశులు రచయితలను పోషించేవారని, ఈ రోజుల్లో ప్రజలే కవులను పోషించాలని శ్రీ రామచంద్రారెడ్డి అన్నారు. రచయితకు అభినందన ఉషశ్రీ మాట్లాడారు. నవ్యసాహితీ సమితి కార్యదర్శి శ్రీ టి. వి. భద్రిరాజు వందన సమర్పణ చేశారు.

నాగావిద్రోహుల దాడిలో ముగ్గురు పోలీసుల మృతి

ఇంఫాల్, మే 9

ఇంఫాల్ - దిమాపూర్ రోడ్డుపై మరమ్‌వద్ద మే 4వ తేదీనాడు నాగా విద్రోహులతో ఘర్షణలో మలబార్ ప్రత్యేక పోలీసుదళానికి చెందిన గస్తీ బృందం సభ్యులు ముగ్గురు మరణించడం మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటం జరిగినది.

నాగా విద్రోహులు దొంగచాటుగా వచ్చి, గస్తీబృందంపై ముట్టడి జరిపి ముగ్గురిని చంపి మూడు రైఫిళ్ళు కొంత మందుగుండు సామగ్రి ఎత్తుకుపోయారు.

నగరంలో భారతీయ హిందీ పరిషత్ సభలు

హైదరాబాద్, మే 9

భారతీయ హిందీ పరిషత్తు 21వ వార్షిక సమావేశానికి ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాద్‌లో ఈ నెల 31వ తేదీ ప్రారంభోత్సవం జరుపుతారు. దక్షిణభారతంలో తొలిసారిగా జరుగనున్న ఈ సమావేశం మూడురోజులపాటు సాగుతుందని పరిషత్తు నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ప్రొఫెసర్ రామకుమార్ వర్మ నిన్న ఇక్కడ పత్రికా ప్రతినిధులతో అన్నారు.

పండితమదనమోహన మాలవ్యా, మహాత్మాగాంధి డాక్టర్ రాజేంద్రప్రసాద్ డాక్టర్ శ్రీ వి. వి. నవాబ్ మెహ్దీ నవాజ్ జంగ్ శ్రీమతి విజయలక్ష్మి పండిత్ ప్రభృతుల ఆశీస్సులతో 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ పరిషత్తు హిందీ భాషాభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిశీలన విశ్వవిద్యాలయస్థాయిలో అవసరమైన ప్రామాణిక గ్రంథాల ప్రచురణ పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ప్రొఫెసర్ వర్మ చెప్పారు.

జూన్‌లో నగరంలో అఖిలభారత మహిళాసభ సమావేశం

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ, మే 8

అఖిలభారత మహిళాసభ కార్యవర్గం జూన్ 7, 8వ తేదీలలో హైదరాబాదులో జరుగుతుందని నేడిక్కడ తెలిసింది.

వచ్చే 3 సంవత్సరాల కాలానికి ఒక కొత్త అధ్యక్షురాలను ఎన్నుకోవడంతోపాటు, సంఘం సాధారణ కార్యకలాపాలు గురించికూడా కార్యవర్గం చర్చిస్తుంది.

కంటోన్మెంటు బోర్డు మాజీసభ్యునిపై కేసులో తీర్పు వాయిదా

(ఆంధ్రభూమి ప్రతినిధి)

సికిందరాబాద్, మే 9

సికిందరాబాద్ కంటోన్మెంట్ మాజీ సభ్యుడు (సోషలిస్టు) శ్రీ జి. యం. అంజయ్య 1963 నవంబరు 29న బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ జి. యం. సయీద్‌పైన టొమాటాలను విసిరిన కేసులో సికిందరాబాద్ అయిదవ నగర మేజిస్ట్రేటు శ్రీ వి. రామకృష్ణ సమక్షంలో ఉభయపక్షాల వాదనలు నిన్నటితో పూర్తి అయినాయి.

శ్రీ అంజయ్య పక్షాన శ్రీ ఆనంతరావు వాదిస్తూ శ్రీ సయీద్ బోర్డు అధ్యక్షపదవీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నది ప్రభుత్వాధికారి హోదాలో కాదని, బోర్డు సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నప్పుడు ఆయన సైనికాధికారి విధులను నిర్వర్తించడంలేదని అన్నారు. ఆ పదవి బాధ్యతలను నిర్వర్తిస్తుండగా ఆయనను ఆటంకపరచలేదని తన విధులను సక్రమంగా నిర్వర్తించాలనే శ్రీ అంజయ్య కోరారని అన్నారు. బోర్డు తరువాత సమావేశాన్ని చాలా దూరపు తేదీవాటికి వాయిదా వేయడానికి అధ్యక్షుడు రైటింగ్ ప్యాడ్ వైపు చూస్తుండగా శ్రీ అంజయ్య టొమాటాల్ని ఆ ప్యాడ్ పైకి విసిరారని ఆయన వాదించారు. శ్రీ అంజయ్య బలహీనంగా ఉండటంవల్ల తినడానికి తమ వెంట టొమాటాలు తెచ్చుకున్నారని కూడా ఆయన అన్నారు.

అధ్యక్షునిపై బలప్రయోగానికే గనక ఆయన పూనుకొని ఉంటే పేపర్ వెయిటో లేదా మరేదైనా గట్టి వస్తువును ఉపయోగించి ఉండేవాడని ఆయన అన్నారు. శ్రీ అంజయ్య అర్థశాస్త్రంలో యం. ఏ. పట్టభద్రుడని సంస్కారవంతుడేగాక ప్రజాసమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తున్న వ్యక్తి అనికూడా ఆయనవాదించారు. టొమాటాలు విసిరిన సంఘటన తరువాత సైనికాధికారులు చట్టాన్ని తమచేతుల్లోకి తీసుకొని శ్రీ అంజయ్యను విపరీతంగా దెబ్బలుకొట్టారని అధ్యక్షుడు వారిని ఆపవలసిందని ఆయన అన్నారు.

శ్రీ అనంతరావు తనవాదనను కొనసాగిస్తూ కృశ్చేవ్ ఐక్యరాజ్యసమితిలో తన నిరసన తెలుపడానికి పాదరక్ష చూపారని పార్లమెంటరీ సంప్రదాయంలో ఇట్టి సంఘటనలు పరిపాటేనని అన్నారు. టొమాటాలు విసిరినందువల్ల అధ్యక్షుని యూనిఫారం చెడిపోయివుంటే పోలీసులు దాన్ని భద్రపరచి కోర్టులో చూపేవారని, యూనిఫారం మరకైనా కాకపోవడంవల్లనే పోలీసులు యూనిఫారంను కోర్టులో చూపలేదని కూడా ఆయన వాదించారు.

పోలీసు ప్రాసిక్యూటింగు ఆఫీసరు శ్రీ వి.యస్. రాజు వాదిస్తూ శ్రీ అంజయ్య శ్రీ సయీద్ సంబంధాలు చెడిపోయాయని, అందుచేత అధ్యక్షునిపై బలప్రయోగం చేయడానికే ఆయన టొమాటాలు విసిరాడని బ్రిగేడియర్ బోర్డు అధ్యక్షుడైనంత మాత్రాన ప్రభుత్వాధికారి కాకపోలేదని అన్నారు.

తీర్పు చెప్పడానికి 1964 మే 11 వాటికి మేజిస్ట్రేటు కేసును వాయిదా వేశారు.

విజయవాడలో డ్రైనేజీ నిర్మాణం త్వరలో సమాప్తం

(ఆంధ్రభూమి ప్రతినిధి)

విజయవాడ, మే 9

పట్టణాభివృద్ధికిగాను కొన్నిసంవత్సరాల క్రితం చేపట్టిన డ్రైనేజీ పథకాన్ని అమలు పరచటంలో, హృదయపూర్వక సహకారాన్నియిస్తూ ఉండవలసిందిగా కేంద్ర ఇరిగేషన్ శాఖామంత్రి డాక్టర్ కె. ఎల్. రావు, విజయవాడ మున్సిపల్ కౌన్సిలర్లకు విజ్ఞప్తిచేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నేడు కౌన్సిల్ సభ్యుల నుద్దేశించి డాక్టర్ రావు ప్రసంగించారు.

రైల్వే, పబ్లిక్ వర్క్సు, ప్రజారోగ్యశాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, చైర్మన్ శ్రీ ఖుద్దూస్, యీసమావేశానికి హాజరైనారు.

ఈనియోజకవర్గంనుండి లోక్‌సభకు తాను పోటీ చేసినప్పటినుండి, ఇక్కడి ప్రజల పరిస్థితిని తాను గమనిస్తూనే ఉన్నానని, నిరుద్యోగసమస్యమరీ అధికమయిందని ఆయన అన్నారు.

పరిశ్రమలను స్థాపించటమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారమని, పరిశ్రమలను స్థాపించాలంటే, విద్యుచ్ఛక్తి నీటిసరఫరా, డ్రైనేజీ కమ్యూనికేషన్ సౌకర్యాలను కల్పించాలని ఆయన చెప్పారు.

బొంబాయిలో ప్రభుత్వ ఉద్యోగుల ఊరేగింపు

బొంబాయి, మే 9

మహారాష్ట్ర ప్రభుత్వోద్యోగులు నేడు తమ కోరికలపట్ల సానుభూతి పొందే నిమిత్తం నగరంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు జరిపారు.

ఆకాశవాణి

మంగళవారం 12-5-1964

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉ: 6-30 సుప్రభాతం. కార్యక్రమ వివరణ 6-40 ఆంగ్లములో వార్తలు 6-45 భక్తిరంజని: (విజయవాడనుండి రిలే) 6-55 సూక్తిముక్తావళి 7-00 తెలుగులో వార్తలు 7-15 సంకీర్తనం (భక్తిపాటలు) 7-30 సుగమసంగీత్: ఉమాసేన్: 7-45 జి. ఎన్. దంతాలే: ఖయాల్ 8-00 ఆంగ్లములో వార్తలు 8-15 విజయవాడవలె 8 30 విజయవాడవలె 9-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మ: 12-30 కార్మికుల కార్యక్రమము 1-00 వనితావాణి (విజయవాడ నుండి రిలే) 1-30 వాద్యగోష్టి 1-40 హిందీలో వార్తలు 1-50 తెలుగులో వార్తలు 2-00 హైదరాబాద్ బి వలె 2-10 ఉర్దూలో వార్తలు 2-20 హైదరాబాద్ బి వలె 2-30 ప్రసార సమాప్తి.

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 ప్రస్తుతాంశం 6-20 సుగమ సంగీత్: ఉమాసేన్ 6-30 నగరవాణి: నగర శ్రోతలకు 7-00 తెలుగులో వార్తలు 7-15 కన్నడ శ్రోతలకు 7-30 ఆంధ్రదేశపు జానపద గేయాలు 7-45 రేడియో వార్తావాహిని 8-00 మీరుకోరిన పాటలు 8-30 కె. ఆర్. సుబ్బులక్ష్మి నటేశన్ 9-00 ఆంగ్లములో వార్తలు 9-15 ఉర్దూలో వార్తలు 9-30 హైదరాబాద్ బి వలె 10-00 జి. ఎన్. దంతాలే: ఖయాల్ 10-30 ఆంగ్లములో వార్తలు 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి జనగణమన.

హైదరాబాద్-బి

కడప

252.1 మీ (1190 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సా: 6-00 నుండి రా: 9-30 వరకు

(హైదరాబాద్ మాత్రమే)

88 42 మీ (3355 కిలోసై)

మ: 1-30 హైదరాబాద్

2-45 ప్రసార సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై)

సా: 6-00 హైదరాబాద్ ఎ వలె 9-00 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

(హైదరాబాద్ మాత్రమే)

మ: 12-30 హైదరాబాద్ ఎ వలె 2-00 వాతావరణ సూచన, కె. ఆర్. సుబ్బులక్ష్మి నటేశన్ 2-30 ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా: 6-00 హైదరాబాద్ ఎవలె 6-20 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 హైదరాబాద్ ఎ వలె 9-25 విరామ సంగీతం 9-30 వి ఎల్. జానకిరామ్: వీణ 10-30 హైదరాబాద్ ఎ వలె 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి, జనగణమన.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ: 6-30 శుభోదయం 6-40 ఆంగ్లములో వార్తలు 6-45 భక్తిరంజని నామావళి టి. ఆర్. సుబ్రహ్మణ్యం, బృందం 6-55 సూక్తిముక్తావళి: 7-00 తెలుగులో వార్తలు 7-15 ప్రసార విశేషాలు 7-20 చతురంగం కదంబ కార్యక్రమము 7-30 దేవేంద్రముర్డేశ్వర్; వేణువు 8-00 ఆంగ్లములో వార్తలు 8-15 ప్రాంజలి 8-30 ఎస్. పి. ఆర్. విఠల్‌రావు 9-00 ప్రసార సమాప్తి.

మ: 12-30 కార్మికుల కార్యక్రమం (హైదరాబాద్ నుండి రిలే) 1-00 వనితావాణి స్త్రీల కార్యక్రమము 1-30 గానసుధ 1-40 హిందీలో వార్తలు 1-50 తెలుగులో వార్తలు 2-00 వాతావరణ సూచన. ప్రసారసమాప్తి.

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 నేటి విశేషం 6-20 గ్రామస్థుల రేడియో గోష్టి 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 ఫిల్మ్ సంగీతం 7-45 రేడియో వార్తావాహిని (హైదరాబాద్ నుండి రిలే) 8-00 ఎస్. పి. ఆర్. విఠల్‌రావు 8-30 ఉభయకుశలోపరి: శ్రోతల ఉత్తరాలకు జవాబులు 8-40 వాద్య సంగీతం 9-00 ఆంగ్లములో వార్తలు 9-25 లలిత సంగీతం 9-30 గజేంద్రమోక్షం హరికథ 10-30 ఆంగ్లములో వార్తలు 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి జనగణమన.

ధరల పరిశీలనకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఉపసంఘం

న్యూఢిల్లీ, మే 9 (పి.టి.ఐ)

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నూతనకార్యవర్గం ప్రధాని శ్రీ నెహ్రూ అధ్యక్షతన నేడుసమావేశమై ఒకధరల ఉపసంఘాన్ని, విప్ విధానాన్ని సమర్థవంతంచేయడానికి మరో ఉపసంఘాన్ని నియమించింది.

ధరలఉపసంఘంలో శ్రీ జగ్జీవన్ రాం, డాక్టర్ హరేకృష్ణమెహతాబ్ రామిరెడ్డి, విభూతిమిశ్రా ఎస్ ఎన్ మిశ్రా ఆర్ ఎస్. పాండే హజారి (కన్వీనర్) ప్రభృతులున్నారు.

విప్ విధానంపై ఏర్పాటుచేసిన ఉపసంఘంలో డిప్యూటీలీడర్లు శ్రీ కె సి. రెడ్డి ఎస్ ఎం ఘోష్ చీఫ్ విప్ శ్రీ సత్యనారాయణ సిన్హా పార్టీకార్యదర్శి హెచ్. సి మాథుర్ ప్రభృతులున్నారు.

విజయవాడలో వడగాడ్పులు

విజయవాడ, మే 9

విజయవాడలో వడగాడ్పులు విపరీతంగా వీస్తున్నాయి గరిష్ఠ ఉష్ణోగ్రత 118 డిగ్రీలనందుకొన్నది రాత్రిపూట కూడా వడగాడ్పులు వీస్తున్నాయి

వారం రోజులుగా గుంటూరు పరిసర ప్రాంతాలలోకూడావడగాడ్పులు వీస్తున్నాయి పగలు రాత్రికూడా వేడిగాలి వీస్తున్నది నిన్న గుంటూరులో ఉష్ణోగ్రత 114 డిగ్రీలకు పెరిగినది.

జిగ్మిడోర్జీ హత్యా నేరంలో అరెస్టయిన సేనాధికారి మరణం

కలకత్తా, మే 9

జిగ్మిడోర్జీ హత్యానేరానికి సంబంధించి అరెస్టుచేయబడినభూటాన్ సైన్యపు మాజీ క్వార్టర్ మాస్టర్ జనరల్ బచుపుగ్వాల్ నిన్న ఉదయం మరణించాడని నేడిక్కడ పత్రికాప్రకటనలో తెలియపరచారు. జైలు గదిలో పుగ్వాల్ ఏప్రిల్ 27వతేదీనాడు కత్తితో తనను తాను పొడుచుకున్నప్పటినుండి ఆయన ఆరోగ్యం ప్రమాదకరంగానే ఉన్నది. 28వ ఏప్రిల్ నాడు ఆయన జిగ్మిడోర్జీ హత్యలో తనపాత్రనుగురించి స్పష్టంగా ఒప్పుకున్నాడు.

రక్షణశాఖ అధికారుల బృందం అమెరికా ప్రయాణం

న్యూఢిల్లీ, మే 9

రక్షణమంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారుల బృందం నేడు వాషింగ్టన్ ప్రయాణమైవెళ్ళినది.

వారంతర్వాత రక్షణమంత్రి చవాన్ అమెరికా వెళ్ళేనాటికి వీరు అమెరికా అధికారులతో ప్రాథమిక చర్చలు జరుపుతారు. చవాన్ మే 17 నాడు అమెరికా వెళ్ళగలరని 29 వరకు అక్కడ ఉండగలరని భావిస్తున్నారు.

విరాళాలకై ప్రధాని నెహ్రూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 9

విభావ చంద్రరాయ్ స్మారకనిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని ప్రధాని నెహ్రూ నేడు విజ్ఞప్తిచేశారు.

దక్షిణకొరియాకు కొత్త మంత్రివర్గం

సియోల్, మే 9 (రాయిటర్)

దక్షిణకొరియా ప్రధానమంత్రి, డూసన్ చోయ్, ఆయన మొత్తంమంత్రివర్గమూ నేడు పదవీ విరమణచేశారు. ఆయన మంత్రివర్గంలోని విదేశాంగ మంత్రి మాజీజనరల్ ఇల్‌క్వోన్ చుంగు నూతన ప్రధానమంత్రిగా నియమితులయ్యారు.

సోషలిస్టు పార్టీ ప్రత్యేక సమావేశం

న్యూఢిల్లీ, మే 9 (పి.టి.ఐ.)

అఖిలభారత సోషలిస్ట్ పార్టీ ప్రత్యేక సమావేశం ఈనెల 24వ తేదీన పాట్నాలో జరుగుతుందని నేడు ప్రకటించారు.

ఈ సమావేశానికి ముందుగా పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఈ నెల23వ తేదీన జరుగుతుంది.

మలేసియాపై మరో శిఖరాగ్ర సమావేశం

మకాపగల్ సూచన

కౌలాలంపూర్, మే 9 (పి.టి.ఐ)

మలేసియా సమస్యను పరిష్కరించడానికి మలేసియా ఇండోనేషియా ఫిలిప్పీన్సు దేశాల మరో శిఖరాగ్ర సమావేశం ఏర్పాటు చేయాలని ఫిలిప్పీన్సు ప్రెసిడెంట్ మకాపగల్ తుంకు అబ్దుల్ రహమాన్‌కు వ్రాసిన ఒక అధికార లేఖలో సూచించారు.

తుంకు అబ్దుల్ రహమాన్ ఆ ప్రతిపాదనను ఇప్పుడు పరిశీలిస్తున్నట్టు విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. మకాపగల్ సమయం స్థలం గురించి ఏమీ సూచించలేదని ఆయన అన్నారు.

భారతీయ ముస్లిం ప్రతినిధివర్గం డెమాస్కస్ రాక

డెమాస్కస్, మే 9

పార్లమెంట్ సభ్యుడు కర్నల్ బి హెచ్ జైదీ నాయకత్వంలో భారతీయ ముస్లిం ప్రతినిధివర్గం ఒకటి నేడిక్కడికి వచ్చినది. నాలుగురోజులపాటు వారీ దేశంలో పర్యటిస్తారు.

దొంగచాటుగా సరుకు చేరవేస్తున్న ఏడుగురు పాకిస్తానీల మృతి

అమృత్‌సర్, మే 9

గతనాలుగు నెలలలో భారత పాకిస్తాన్ సరిహద్దులలో పోలీసులతో ఘర్షణలో దొంగచాటుగానరుకులు రవాణా చేసే ఏడుగురు (అంతాపాకిస్తానీయులే) మృతినొందినట్టు సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ గురుభరత్‌సింగ్ చెప్పారు ఇదేసమయంలో పోలీసులు 176మందిని అరెస్టుచేశారు.

సంతానం కమిటీ సిఫార్సుల అమలుకై సమాలోచనలు

న్యూఢిల్లీ, మే 9

అవినీతి నిరోధానికి సంతానంకమిటీ చేసిన సిఫార్సును అమలుపరచే విషయంపై వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల సమావేశం నేడిక్కడ సమాలోచనలు జరిపింది.

కేంద్ర హోంమంత్రి శ్రీ నందా ఏర్పాటు చేసిన ఈసమావేశానికి దేశీయ వ్యవహారాల శాఖమంత్రి శ్రీ జె యల్ హాథీ, మంత్రివర్గ కార్యదర్శి శ్రీ యస్. యస్. ఖేరా ఇంకా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు హాజరైనారు.

పార్లమెంటు సభ్యుల వేతనాల హెచ్చింపు బిల్లుపై చర్చ

న్యూఢిల్లీ, మే 8

పార్లమెంటు సభ్యుల వేతనాలు హెచ్చించే బిల్లుపై నేడు రాజ్యసభ వాయిదా పడడానికి ముందు అసంపూర్తిగా చర్చించింది.

ఈ బిల్లును లోక్‌సభ ఇదివరకే ఆమోదించింది. తిరిగి మే 27న ప్రారంభం కాగల రాజ్యసభ సమావేశంలో ఈ బిల్లుపై పరిశీలన జరుగుతుంది.

కాంగ్రెసు సభ్యుడు శ్రీ యం. పి. భార్గవ బిల్లును ప్రతిపాదిస్తూ జీవనవ్యయం విపరీతంగా పెరిగిపోయినందువల్ల పార్లమెంటు సభ్యులకు నిత్యజీవితావసరాలను తీర్చుకోవడం ఇబ్బందిగా ఉందని చెప్పారు. విదేశాలలో పార్లమెంటు సభ్యులు పొందుతున్న వేతనాలతో తమ వేతనాలను ఆయనపోల్చి ప్రపంచమంతటిలోకీ భారత పార్లమెంటుసభ్యులే అత్యంత స్వల్ప వేతనాలు పొందుతున్నారని ఆయన అన్నారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్ గుప్త బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ సుమారు రెండు గంటలసేపు ప్రసంగించారు. నైతికంగానూ ఆర్థికంగానూ వివిధంగా చూచినా బిల్లు సమర్థనీయం కాదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ సభ్యుడు శ్రీ అబిద్ ఆలీ మాట్లాడుతూ శ్రీ గుప్త వాదనలను ఖండిస్తూ కమ్యూనిస్టులుజాతి విద్రోహ కార్యకలాపాలలో నిమగ్నులై ఉన్నారని ఆయన ఆరోపించారు.

రాజ్యసభలోని ఇతర కమ్యూనిస్టు, సోషలిస్టుపార్టీ సభ్యులుకూడా బిల్లును నిశితంగా విమర్శించారు.

బిల్లును విమర్శించినవారు తరువాత అధిక వేతనాలను తీసుకోబోమనిముందే ప్రకటించాలని [illegible] అన్నారు.

జనసంఘం సభ్యుడు శ్రీ డి. ఠెంగడి మాట్లాడుతూ జీవనవ్యయం ఒక పార్లమెంటు సభ్యులకు మాత్రమే పెరుగలేదని అన్నారు.

శుక్రవారం 15-5-64న విడుదల!

......ఇంతవరకు వెండితెరపై రాని మహోజ్జ్వల సాంఘిక గాథ......

శ్రీరామా పిక్చర్స్ వారి

"దేశద్రోహులు"



నటీనటులు: ఎన్. టి. రామారావు దేవిక, జానకి, కాంతారావు, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, రాజనాల.

నిర్మాత, దర్శకుడు బొళ్ళ సుబ్బారావు

సంగీతం ఎస్. రాజేశ్వరరావు

అశోక్ హైదరాబాద్ | ప్యారడైజ్ సికిందరాబాద్

మార్కండేయ వరంగల్ | అశోక్ నిజామాబాద్

—ఈస్ట్ ఇండియా రిలీజ్—

అతిత్వరలో విడుదల!

మీ అభిమాన థియేటర్లలో

ఎదురు చూడండి

4వ సంయుక్త వారం!

దేశదేశాలవారికి స్వర్గ ధామంగా రూపించిన కాశ్మీర్ దృశ్యాల నేపథ్యంలో ప్రణయాలను, వినోదాలనూ పంచిపెట్టిన ఉత్తమ వర్ణచిత్రం

శక్తిఫిలిమ్స్ వారి

* కాశ్మీర్ కి కలి *

(ఈస్ట్‌మన్ కలర్)

నిర్మాత, దర్శకుడు: శక్తిసామంత్ సంగీతం: ఓ. పి. నయ్యర్

షమ్మీకపూర్, షర్మిలాటాగూర్, ప్రాణ్, నాజిర్ హుస్సేన్ ధూమల్ అనూప్ కుమార్, మదన్‌పురి

[illegible] హైదరాబాద్ | నటరాజ్ సికిందరాబాద్ | సాదిప్ ఔరంగాబాద్

రోజు 3 ఆటలు: 3-15 6-15, 9-30

—కపూర్ చంద్ అండ్ బ్రదర్స్ రిలీజ్—

Printed by K R Pattabhiram B.A for the Proprietors at the Deccan Chronicle Press 36 Sarojini Devi Road, Secunderabad Managing Editor & Publisher: K R Nandagopal. G.M.E. Editor: Gora Sastry.